JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రభాత జయభేరి
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజిగిరి । శనివారం 07-03-2026
Medchal - Malkajgiri । Saturday 07-03-2026
Follow: jayabherinews
సంపుటి : 02 । సంచిక : 280
పేజీలు : 8 । వెల : 5
Vol. 02 । Issue 280 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను

మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...

9391 544 889
call me

jayabheripaper@gmail.com



## ఈ ఊచకోత ఆపే ప్రసక్తే లేదు..

# ఇక రక్తపాతమే..



2 లో

- **లొంగిపోవడం తప్ప ఇరాన్‌కు మరో దారి లేదు..**

**జయభేరి, న్యూఢిల్లీ:**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై తన కఠిన వైఖరిని మరోసారి స్పష్టంగా ప్రకటించారు. ప్రస్తుతం కొన సాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల మధ్య ఇరాన్‌తో ఎలాంటి రాజీ చర్చలు జరపబోమని, అమెరికా అంగీకరించేది ఒక్కటే - "పూర్తి లొంగుబాటు" అని ఆయన పేర్కొన్నారు. ఈ విషయాన్ని ట్రంప్ తన సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్‌లో చేసిన సందేశం ద్వారా వెల్లడించారని తెలిపింది. ఫిబ్రవరి 28 నుంచి ప్రారంభమైన ఘర్షణల నేపథ్యంలో ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు అమెరికా యుద్ధ లక్ష్యాలపై ఇప్పటివరకు వచ్చిన అత్యంత స్పష్టమైన ప్రకటనగా భావిస్తున్నారు. ఇటీవల పలు దేశాలు మధ్యవర్తిత్వ ప్రయత్నాలు ప్రారంభించినప్పటికీ, ఇప్పుడు వాటికి తలుపులు మూసినట్లుగా ట్రంప్ వ్యాఖ్యలు కనిపిస్తున్నాయని అంతర్జాతీయ రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ట్రంప్ తన సందేశంలో, "ఇరాన్‌తో ఎలాంటి ఒప్పందం ఉండదు. పూర్తి లొంగుబాటు తప్ప మరే ఎంపిక లేదు" అని స్పష్టం చేశారు. ఇదే కాకుండా, యుద్ధం ముగిసిన తర్వాత ఇరాన్‌లో కొత్త నాయకత్వం ఏర్పడాలని కూడా ఆయన సూచించారు.

## పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ



- **ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలను కనే తల్లులకు రూ. 25 వేల ప్రోత్సాహకం!**

**జయభేరి, అమరావతి:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మారుతున్న జనాభా గమనగతులు, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒక సంచలన నిర్ణయాన్ని ప్రకటించారు. రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు తగ్గుతున్న నేపథ్యంలో, జనాభా సమతుల్యతను కాపాడేందుకు 'పాపులేషన్ మేనేజ్‌మెంట్' పేరుతో కొత్త విధానాన్ని అసెంబ్లీ వేదికగా ప్రవేశపెట్టారు.

**పాలసీలోని ముఖ్యాంశాలు:**

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఈ నూతన విధానం ప్రకారం, జనాభా పెరుగుదలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం భారీ ఆర్థిక ఊతాన్ని అందించనుంది.
ఆర్థిక ప్రోత్సాహకం: ఇద్దరి కంటే ఎక్కువ...మిగతాది 2 లో


## మినీ మాల్దీవులుగా.. కృష్ణా నది బ్యాక్ వాటర్స్



- **నాగర్‌కర్నూల్ జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన సోమశిలను తెలంగాణ మినీ మాల్దీవులు**
- **ఒక్కసారి ఈ ప్రాంతాన్ని సందర్శిస్తే.. మళ్లీమళ్లీ రావాలనిపించేలా ఈ ప్రాంతం**

**జయభేరి, మహబూబ్ నగర్, మార్చి 6 :**

వీకెండ్‌లో ఎక్కడికైనా ట్రిప్ ప్లాన్ చేస్తున్నారా.. వరుస సెలవుల్లో మాల్దీవులు లాంటి ప్రదేశాలకు వెళ్లాలని అనుకుంటున్నారు. తెలుగు రాష్ట్రాలు దాటి ఎక్కడికి వెళ్లినా ఖర్చుతో కూడుకున్న యాత్రే అవుతుంది. ముఖ్యంగా హైదరాబాద్‌లో ఉండే వారు తక్కువ బడ్జెట్‌లో మాల్దీవులను చూసి ఫీలింగ్ పొందడానికి ఓ ఆహ్లాదకరమైన ప్రదేశం ఉంది. అదే తెలంగాణ మినీ మాల్దీవులు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన సోమశిలను తెలంగాణ ...మిగతాది 2 లో



> కొత్వాలగూడలో ఎకో హిల్ పార్క్ ను ప్రారంభించాను. ఓఆర్ఆర్ ను బుద్వేల్ లేఅవుట్‌తో కలిపే రేడియల్ రోడ్–2 ఇంటర్‌చేంజ్‌కు శంకుస్థాపన చేశాను. హైదరాబాద్ ను సుందరమైన, పరిశుభ్రమైన, అహ్లాదరకమైన నగరంగా మారుస్తాం. ఈ క్రమంలో ఏ ఒక్కరికి అన్యాయం జరగనివ్వను. ఎవరినీ అనాథలుగా వదిలేయను. పేదలు మూసీ కంపులో బతకాలని గత పాలకులు కోరుకున్నారు. వారిని ఆత్మగౌరవంతో, పరిశుభ్రమైన వాతావరణంలో బతికేలా చేస్తామని మేం చెబుతున్నాం. మేం మంచి చేయలేదు కాబట్టి, మీరు కూడా మంచి చేయడానికి వీలులేదు అన్నట్టుగా బీఆర్ఎస్ తీరు ఉంది. అభివృద్ధి, సంక్షేమంలో రాజీ లేదు. మూసీ నిర్వాసితులను ఆదుకునే బాధ్యత నాది. హైదరాబాద్ మహానగరాన్ని ప్రపంచంలోనే గొప్ప నగరంగా మార్చడానికి అందరు కలిసి రావాలి.
>
> \- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

## భూ నిర్వాసితులకు మంచి పరిహారం


# బాధ్యత నాది

- **అభివృద్ధి జరగాలంటే ఎవరిదో ఒకరి భూమి ఎంతో కొంత తీసుకోక తప్పని పరిస్థితి**
- **మూసీనది పూర్తిగా మురికితో నిండిపోయింది**
- **భూమి పోయిన దుఃఖం ఎవరికైనా ఉంటుంది**
- **మీరు మాకు శత్రువులు కాదు.. మిత్రులు**
- **ఏం చేసినా అడ్డం పడతామంటున్న కేటీఆర్**
- **ట్రంప్, ఎలాన్‌మస్క్ సంస్థలు రాబోతున్నాయి**
- **కొత్వాల్‌గూడ ఎకో పార్కు ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి**

*మారుతున్న కాలానికి అనుగుణంగా రాష్ట్రంలో అమలు చేస్తున్న అభివృద్ధి ప్రణాళికల్లో నిర్వాసితులు ఎవరికీ నష్టం జరక్కుండా అందరినీ ఆదుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. "కొత్త ప్రాజెక్టులు వచ్చినప్పుడు కొందరికి ఇబ్బంది ఉండొచ్చు. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టులో ఎవరినీ అనాథలను చేయం. భూమి పోయినా, ఇండ్లు పోయినా ప్రభుత్వం మంచి నష్టపరిహారమిచ్చి ఆదుకుంటుంది. నిర్వాసితులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం" అని చెప్పారు. బుద్వేల్ లేఅవుట్‌తో కలిపే రేడియల్ రోడ్-2 ఇంటర్‌చేంజ్‌కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం కొత్వాలగూడలో ఎకో పార్క్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారు.*

**జయభేరి, హైదరాబాద్ :**

మారుతున్న కాలానికి అనుగుణంగా రాష్ట్రంలో అమలు చేస్తున్న అభివృద్ధి ప్రణాళికల్లో నిర్వాసితులు ఎవరికీ నష్టం జరక్కుండా అందరినీ ఆదుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. "కొత్త ప్రాజెక్టులు వచ్చినప్పుడు కొందరికి ఇబ్బంది ఉండొచ్చు. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టులో ఎవరినీ అనాథలను చేయం. భూమి పోయినా, ఇండ్లు పోయినా ప్రభుత్వం మంచి నష్టపరిహారమిచ్చి ఆదుకుంటుంది. నిర్వాసితులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం" అని చెప్పారు.
బుద్వేల్ లేఅవుట్‌తో కలిపే రేడియల్ రోడ్ 2 ఇంటర్‌చేంజ్‌కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం కొత్వాలగూడలో ఎకో పార్క్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారు.
"మూసీనది పూర్తిగా మురికితో నిండిపోయింది. కానీ ఇప్పుడు కాలం మారింది. భవిష్యత్తు మారుతోంది. అందుకు అనుగుణంగా మహానగరానికి ప్రణాళికలు మార్చుకోవాలి. ప్రజలు ఎవరూ మురికిలో బతకాలను కోరు. విధిలేక మురికికూపాల్లో నివసిస్తున్నారు. ఆ పరిస్థితి నుంచి బయటకు తీసుకురావాలి. పేదల గురించి ఆలోచించి అందరినీ మెప్పించి, ఒప్పించి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తాం. ఈ అభివృద్ధిలో ఇక్కడి వారందరినీ భాగస్వామ్యం చేస్తాం. ఎక్కడ ఉన్న వాళ్లకు అక్కడే ఇండ్లు కట్టించడానికి ఏర్పాటు చేస్తాం. రీజినల్ రింగ్ రోడ్డు కట్టాలన్నా, రేడియల్ రోడ్లు వేయాలన్నా, బుల్లెట్ ట్రైన్ నిర్మించాలన్నా, ఎవరిదో ఒకరిది భూమి కోల్పోవాల్సిన పరిస్థితి. భూమి కోల్పోయిన ...మిగతాది 2 లో



## యూపీఎస్సీలో తెలుగు విద్యార్థులకు ర్యాంకులు

- **అనూజ్ అగ్నిహోత్రి యూపీఎస్సీ సివిల్స్ టాపర్**
- **సివిల్ సర్వీసెస్ పరీక్షలో మొత్తం 958 మంది అభ్యర్థులు అర్హత**
- **మెరిట్ జాబితా అభ్యర్థుల ఎంపిక**

**జయభేరి, న్యూఢిల్లీ, మార్చి 6 :**

దేశంలోనే అత్యున్న సర్వీసులైన UPSC CSE 2025 తుది ఫలితాలు విడుదలయ్యాయి. లక్షలాది మంది అభ్యర్థులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సివిల్ సర్వీసెస్ రిజల్ట్స్ శుక్రవారం మధ్యాహ్నం రిలీజ్ చేశారు. అనూజ్ అగ్నిహోత్రి యూపీఎస్సీ సివిల్స్ టాపర్‌గా నిలిచాడు. సివిల్ సర్వీసెస్ పరీక్షలో మొత్తం 958 మంది అభ్యర్థులు అర్హత సాధించారు...మిగతాది 2 లో

# ఈటెల దారెటు

- **పార్టీ అధిష్ఠానం కావాలని ఇలా చేసిందా?**
- **వేరే వ్యక్తుల ఒత్తిడి వల్ల ఇలా చేస్తోందా?**
- **రాజేందర్ గులాబీ గూటికి వెళ్తారని సోషల్ మీడియాలో ప్రచారం**



**జయభేరి, హైదరాబాద్, కరీంనగర్, మార్చి 6 :**

తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించి.. గులాబీ పార్టీలో కీలక నాయకుడిగా ఎదిగిన ఈటెల రాజేందర్ అనివార్య పరిస్థితుల్లో అత్యంత అవమానకరంగా కారు ...మిగతాది 2 లో

మొదటిపేజీ తరువాయి

## బాధ్యత నాది

దుఃఖం ఉంటది. కానీ వేరే దగ్గర భూమి కొనుక్కునేంతగా నష్టపరిహారం ఇచ్చే బాధ్యత నాది. అహ్మదాబాద్‌లో సబర్మతీ నది రివర్ ఫ్రంట్, ఢిల్లీలో యమునా రివర్‌ఫ్రంట్, ఉత్తరప్రదేశ్‌లో గంగానది రివర్ ఫ్రంట్ ఎలాగైతే అభివృద్ధి చేశారో, హైదరాబాద్‌లో మూసీ రివర్ ఫ్రంట్ ను అభివృద్ధి చేసుకుంటున్నాం. దీని చుట్టూ రాత్రి పూట వ్యాపారాలు చేసుకునే ఏర్పాట్లు చేస్తాం. నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. శాంతిభద్రతలను పటిష్టం చేస్తాం. నైట్ టూరిజంకు శ్రీకారం చుడుతున్నాం. ఈ ప్రాజెక్టులో భూములు కోల్పోయే వారికి ఆయా నియోజకవర్గాల్లోనే ప్రభుత్వ స్థలాల్లో ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తాం. గొప్ప గొప్ప చారిత్రక కట్టడాలతో ప్రపంచంలోనే అందమైన నగరంగా హైదరాబాద్ విలసిల్లింది. అలాంటి హైదరాబాద్ మహా నగరం చెత్త చెదారంతో నిండిపోయిందన్న వరకు తెచ్చారు. ఇప్పుడు హైదరాబాద్‌ను తిరిగి అద్భుతంగా తీర్చిదిద్దాలనుకుంటే కొందరు అడ్డుకుంటున్నారు. ప్రపంచంలోనే గొప్ప నగరంగా తీర్చిదిద్దుతాం. హైదరాబాద్‌లో ఐటీ కంపెనీలతో పాటు అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మించే సమయంలో కూడా కొందరికి నష్టం జరిగింది. చిన్న కాలనీలు కాకుండా పెద్ద నగరమే నిర్మించాలన్న లక్ష్యంతో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నాం. శంషాబాద్ ప్రాంతం బుల్లెట్ ట్రైన్ హబ్‌గా మారనుంది. బెంగుళూరు, అమరావతి, పూణె, చెన్నై నగరాలకు ఇక్కడి నుంచే బుల్లెట్ ట్రైన్ సౌకర్యాలు రాబోతున్నాయి. దావోస్ అన్ని అనుమతులు వచ్చాయి. ట్రంప్, ఎలాన్ మస్క్ లకు సంబంధించిన సంస్థలు ఇక్కడికి రాబోతున్నాయి. ప్రపంచంలోనే గొప్ప నగరాన్ని ఇక్కడ నిర్మిస్తున్నాం. ఇది ప్రారంభమే. ప్రపంచంతోనే పోటీ పడే అభివృద్ధి ఇక్కడ జరుగుతుంది" అని చెప్పారు. అంతకు ముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎకో హిల్ పార్క్ ను సందర్శించడంతో పాటు బర్డ్ ఏవియరీని ప్రారంభించారు.

## యూపీఎస్సీలో తెలుగు విద్యార్థులు

జనరల్ కేటగిరీలో 317 మంది సెలక్ట్ కాగా, ఈడబ్ల్యూఎస్ కోటా నుంచి 104 మంది, ఓబీసీ నుంచి 306 మంది, ఎస్సీ కేటగిరీలో 158, ఎస్టీ కేటగిరీ నుంచి 73 మంది పలు సర్వీసులకు ఎంపికయ్యారు. UPSC తన అధికారిక వెబ్‌సైట్‌లో సివిల్ సర్వీసెస్ పరీక్ష ఫైనల్ రిజల్ట్స్ ప్రకటించింది. అభ్యర్థులు ఇక్కడ ఇచ్చిన స్టెప్స్ ద్వారా ఫలితాలను చెక్ చేసుకోవచ్చు. అభ్యర్థులు యూపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించి వివరాలు నమోదు చేసి తమ ఫలితాలను చూడవచ్చు. ఫలితాలు విడుదలైన వెంటనే దేశవ్యాప్తంగా విజయం సాధించిన అభ్యర్థులు, వారి కుటుంబాల్లో ఆనందం నెలకొంది. ఇటీవల ఇంటర్వ్యూ నిర్వహించారు. పర్సనాలిటీ టెస్ట్ పాసైన అభ్యర్థుల మెరిట్ జాబితా తాజాగా విడుదల చేశారు. ఫలితాలు UPSC వెబ్‌సైట్‌లో http//www.upsc.gov.in లో కూడా అందుబాటులో ఉంటాయి. మార్కులను ఫలితం ప్రకటించిన తేదీ నుండి 15 రోజుల్లోపు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతారు.
UPSC సివిల్ సర్వీసెస్ పరీక్ష మూడు దశల్లో నిర్వహిస్తారు. ఇందులో ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ ఉంటాయి. ఈ మూడు దశలను ఉత్తీర్ణులైన తర్వాతే అభ్యర్థులను సివిల్ సర్వీసెస్‌కు ఎంపిక చేస్తారు. ఈసారి ఇంటర్వ్యూ ప్రక్రియ జనవరి 2026 నుండి ప్రారంభమై ఫిబ్రవరి చివరి వారం వరకు కొనసాగింది. ఢిల్లీలోని ధోల్‌పూర్ హౌస్‌లో ఉన్న UPSC ప్రధాన కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూ, పర్సనాలిటీ టెస్ట్‌కు మొత్తం 275 మార్కులు నిర్ణయించారు. ఈ మార్కులను మెయిన్స్ పరీక్ష మార్కులతో కలిపి ఫైనల్ మెరిట్ లిస్ట్ రూపొందిస్తారు. ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (IAS), ఇండియన్ పోలీస్ సర్వీస్ (IPS), ఇండియన్ ఫారిన్ సర్వీస్, ఇండియన్ రెవెన్యూ సర్వీస్, ఇండియన్ ట్రేడ్ సర్వీస్‌తో పాటు, ఇతర గ్రూప్ A, గ్రూప్ B సర్వీసుల్లో కూడా ఎంపికైన అభ్యర్థులను నియమిస్తారు. UPSC సివిల్ సర్వీసెస్ పరీక్ష 2025 మొత్తం ప్రక్రియ చాలా నెలల పాటు కొనసాగింది. మొదట ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించారు. ఆ తర్వాత ఉత్తీర్ణులైన అభ్యర్థులు మెయిన్స్ పరీక్షలకు హాజరయ్యారు. మెయిన్స్‌లో ఉత్తీర్ణులైన తర్వాత అభ్యర్థులను ఇంటర్వ్యూ లేదా పర్సనాలిటీ టెస్ట్‌కు పిలిచారు.

## పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ

మంది పిల్లలను కనే తల్లులకు ప్రసవ సమయంలో ప్రభుత్వం రూ. 25,000 నగదు ప్రోత్సాహకాన్ని అందజేయనుంది. **అమలు తేదీ:** ఈ సరికొత్త జనాభా నిర్వహణ పాలసీ ఏప్రిల్ 1 నుండి రాష్ట్రవ్యాప్తంగా అమలులోకి రానుంది. **దార్శనికత:** రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకున్న ఈ నిర్ణయం ఆయన దూరదృష్టికి నిదర్శనమని ప్రభుత్వం పేర్కొంది. **నేపథ్యం:** సాధారణంగా ప్రభుత్వాలు జనాభా నియంత్రణకు ప్రాధాన్యత ఇస్తుంటాయి. అయితే, ఆంధ్రప్రదేశ్‌లో యువత సంఖ్య తగ్గడం, వృద్ధుల సంఖ్య పెరుగుతుండటం వల్ల భవిష్యత్తులో మానవ వనరుల కొరత ఏర్పడే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ తరుణంలో ముఖ్యమంత్రి ప్రకటించిన ఈ 'ప్రోనేటల్' పాలసీ ప్రాధాన్యత సంతరించుకుంది. ఇప్పటికే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఉన్న 'ఇద్దరు పిల్లల పరిమితి' నిబంధనను తొలగించిన ఏపీ ప్రభుత్వం, ఇప్పుడు నేరుగా ఆర్థిక ప్రోత్సాహకాలను ప్రకటించడం ద్వారా తన విధానపరమైన మార్పును స్పష్టం చేసింది.

## మినీ మాల్దీవులుగా..

మినీ మాల్దీవులుగా పిలుస్తారు. జాతీయ ఉత్తమ గ్రామీణ పర్యాటక ప్రాంతంగా సోమశిలకు అవార్డు కూడా దక్కింది. కృష్ణా నది బ్యాక్ వాటర్స్ అందాలతో ముస్తాబైన ఈ ప్రాంతం, ఇప్పుడు పర్యాటకులకు మినీ మాల్దీవులుగా మారిపోయింది. నాగర్ కర్నూల్ జిల్లా పరిధిలోని కొల్లాపూర్ సమీపంలో ఉన్న సోమశిల గ్రామం వద్ద కృష్ణా నది ఒక సముద్రాన్ని తలపిస్తుంది. శ్రీశైలం డ్యామ్ బ్యాక్ వాటర్స్ ఇక్కడ భారీ జలాశయంగా కనిపిస్తాయి. నల్లమల అటవీ శ్రేణుల మధ్యలో ఈ నీటి ప్రవాహం పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తోంది. నగర జీవన ఒత్తిడి నుంచి ఉపశమనం పొందాలనుకునే వారికి సోమశిల ఒక ఫర్ఫెక్ట్ డెస్టినేషన్ అని చెప్పొచ్చు. ఒక్కసారి ఈ ప్రాంతాన్ని సందర్శిస్తే.. మళ్లీమళ్లీ రావాలనిపించేలా ఈ ప్రాంతంలో ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. తెలంగాణ టూరిజం ఆధ్వర్యంలో అత్యాధునిక వసతులు కల్పించారు. నది తీరాన నిర్మించిన హరిత రిసార్ట్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. నదికి ఎదురుగా ఉండే కాటేజీల కిటికీల నుంచి చూస్తే నీటి అలలు పాదాలను తాకుతున్నాయా..? అన్నంత దగ్గరగా ప్రకృతి కనిపిస్తుంది. ఇక్కడ బోటింగ్ ప్రయాణం అత్యంత సాహసోపేతంగా, ఆహ్లాదకరంగా ఉంటుంది. కొండల మధ్య నీటిలో పడవలో ప్రయాణిస్తుంటే తియ్యని అనుభూతి కలుగుతుంది. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న క్రూయిజ్ బోట్లు పర్యాటకులను అద్దాల మర్రి వంటి సమీప ప్రాంతాలకు తీసుకెళ్తాయి. ఇక్కడ వ శతాబ్దానికి చెందిన సుప్రసిద్ధ శ్రీ లలిత సోమేశ్వర స్వామి దేవాలయం కూడా ఉంది. 12 జ్యోతిర్లింగాలకు ప్రతీకగా ఇక్కడ 12 శివలింగాలు కొలువై ఉండటం విశేషం. ప్రతీ సంవత్సరం పుష్య బహుళ అమావాస్య రోజున ఇక్కడ జరిగే జాతరకు వేలాది మంది భక్తులు తరలివస్తారు. కృష్ణా నదిలో పవిత్ర స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుంటారు. సోమశిల ప్రాంతం హైదరాబాద్ నుంచి సుమారు 170 నుంచి 180 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. వీకెండ్స్‌లో పర్యాటకుల రద్దీ ఎక్కువగా ఉండడంతో హరిత రిసార్ట్స్‌లో బస చేయాలనుకునేవారు ముందుగానే ఆన్‌లైన్ బుక్ చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

## ఇక రక్తపాతమే...

అమెరికాకు అనుకూలంగా ఉండే నాయకత్వం రావాలని చెప్పడం ద్వారా భవిష్యత్తులో ఇరాన్ పాలనపై వాషింగ్టన్ ప్రభావం ఉండాలని ఆయన సంకేతాలు ఇచ్చినట్లు భావిస్తున్నారు. ఇరాన్‌లో ప్రస్తుతం రాజకీయ పరిస్థితి కూడా అస్థిరంగానే ఉంది. ఫిబ్రవరి 28న జరిగిన దాడుల్లో సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖామెనీ మరణించిన తరువాత దేశంలో తాత్కాలిక నాయకత్వ మండలి పాలన కొనసాగుతోంది. అమెరికా, తన మిత్రదేశాలు కలిసి ఇరాన్‌ను మళ్లీ అభివృద్ధి దిశగా తీసుకెళ్తామని ఆయన పేర్కొన్నారు. ఆర్థికంగా బలమైన దేశంగా తిరిగి నిలబెట్టేందుకు సహకరిస్తామని చెప్పారు. "ఇరాన్‌ను మళ్లీ గొప్ప దేశంగా మార్చుదాం" అనే నినాదాన్ని ఉపయోగించారు. ఈ వ్యాఖ్యలపై ఇరాన్ వైపు నుంచి కూడా స్పందన వచ్చింది. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ మాట్లాడుతూ, పలు దేశాలు మధ్యవర్తిత్వానికి ప్రయత్నిస్తున్నాయని అంగీకరించారు.

# యుద్ధం కూడా.. ఎన్నికల అస్త్రమే



ఇరాన్ అణు కార్యకలాపాలు ఆపడం లేదని అమెరికా మిడిల్ ఈస్ట్‌లో అగ్ని పుట్టించింది. ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్‌పై దాడులు చేస్తోంది. తొలిరోజు దాడిలోనే సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ మరణించాడు. దీంతో ఇరాన్ కూడా ప్రతి దాడులు తీవ్రతరం చేసింది. అమెరికాకు అండగా నిలిచిన సున్నీ జనాభా అధికంగా ఉండే గల్ఫ్ దేశాలపై వైమానిక దాడులతో విరుచుకుపడుతోంది. ఇజ్రాయెల్ ప్రధాని కార్యాలయాన్ని అటాక్ చేసింది. ఇక సౌదీ అరేబియాలోని ఆరామ్‌కో రిఫైనరీపై దాడిచేసింది. దీంతో ఆయిల్ ఉత్పత్తి, శుద్ధి నిలిచిపోయాయి. మరోవైపు ఆర్మూజ్ జలసంధి మూసివేసింది. ఈ క్రమంలో కేంద్రం గల్ఫ్ దేశాల్లోని భారతీయలను కాపాడేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే చాలా మందిని స్వదేశానికి రప్పించింది. యుద్ధం నేపథ్యంలో దేశంలో ఆయిల్ సంక్షోభం తలెత్తకుండా ప్రణాళికలు రూపొందిస్తోంది. ఈ తరుణంలో దేశంలోని విపక్ష పార్టీలు లౌకిక వాదం ముసుగులో మోదీ టార్గెట్‌గా కేంద్రంపై విమర్శలు చేస్తున్నాయి. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీని అమెరికా చంపేసిందని దీనిని ప్రధాని మోదీ ఖండించాలని కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీ డిమాండ్ చేశారు. ఒక దేశా అధినేతను చంపితే మోదీ అమెరికాకు లొంగిపోయి మౌనం పాటిస్తున్నాడని లోక్‌సభలో విపక్ష నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. ఇజ్రాయెల్, అమెరికా యుద్ధాన్ని ఖండించాలని డిమాండ్ చేశారు. ఖమేనీ హత్య తర్వాత ప్రపంచ వ్యాప్తంగా షియాలు నిరసన తెలిపారు. భారత దేశంలోని జమ్మూ కశ్మీర్‌లో, మిగతా కొన్ని ప్రాంతాల్లో నిరసన ర్యాలీలు తీశారు. జమ్మూ కశ్మీర్‌లో ర్యాలీ ఉద్రికతతకు దారితీసింది. అయితే విపక్షాలు ఈ ర్యాలీలకు మద్దతు తెలిపాయి. అయితే ఇదంతా ఎందుకుం అంటే తమ ఓటు బ్యాంకు అయిన ముస్లింల కోసమే. ఇరాన్ యుద్ధం సాకుతో ముస్లింలకు అండగా ఉండడంతోపాటు మోదీని టార్గెట్ చేయడం ద్వారా తమ ఓటు బ్యాంకు బలపడుతుందని ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్‌తోపాటు వామపక్షాలు, ఇతర ప్రాంతీయ విపక్ష పార్టీలు భావిస్తున్నాయి. అయితే విపక్షాలు గమనించాల్సింది ఏమిటంటే.. ఈ యుద్ధం మొదట ఇరాన్, అమెరికా, ఇజ్రాయెల్ మధ్య మొదలైంది. కానీ, తర్వాత ఇరాన్ సున్నీలను టార్గెట్ చేస్తూ గల్ఫ్ దేశాలపై దాడులు చేయడంతో ఇప్పుడు సున్నీలు, షియాల మధ్య యుద్ధంగా మారింది. మన దేశంలో ముస్లిం జనాభాలో 85 శాతం సున్నీలే. షియాలతోపాటు మిగతా చిన్నచిన్నచిన్న ఇస్లామిక్ మతాలు కలిపి 15 శాతం ఉన్నాయి. షియాలకు మద్దతు తెలుపుతున్న దేశంలోని విపక్ష పార్టీలు. 85 శాతం ఉన్న సున్నీలకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్నామన్న విషయాన్ని విస్మరిస్తున్నాయి. దేశంలోని కేరళ, తమిళనాడు, పశ్చిమబెంగాల్ అస్సాంలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. బెంగాల్, అస్సాం, కేరళ రాష్ట్రాల్లో ముస్లిం జనాభా ఎక్కువ. ఇందులోనూ సున్నీలే 90 శాతం విపక్షాలు షియాలకు మద్దతుగా నిలవడం ద్వారా రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో సున్నీల ఓట్లు కోల్పోయే ప్రమాదం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. మోదీ వ్యతిరేక ముస్లింలు మాత్రమే విపక్షాలకు మద్దతు తెలుపుతారని, షియా వ్యతిరేక సున్నీలు మద్దతు ఇచ్చే అవకాశం ఉండదని పేర్కొంటున్నారు. ఇరాన్ అణు కార్యక్రమాలు నిర్వహిస్తోందని, శాంతియుతంగా చర్చలు జరిపినా మారడం లేదని అగ్రరాజ్యం అమెరికా యుద్ధం ప్రకటించింది. ఇజ్రాయెల్‌తో కలిసి యుద్ధం చేస్తోంది. తొలి రోజే ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీని చంపేసింది. దీంతో ఇరాన్ ప్రతిదాడులు చేస్తోంది. యూఏఈ, ఖతార్, బహ్రెయిన్‌లోని అమెరికా ఎయిర్‌బేస్‌లు, రాయబార కార్యాలయాలు, ఆర్థిక మూలాలు లక్ష్యంగా వైమానిక దాడులు చేస్తోంది. ఇజ్రాయెల్‌పైనా యుద్ధం కొనసాగిస్తోంది. ఒమాన్ మినహా ఏడు ముస్లిం దేశాలు అమెరికా అనుకూలంగా ఉండటంతో యుద్ధం సుదీర్ఘంగా సాగే అవకాశం కనిపిస్తోంది. 'ఖమేనీ హత్య పరిణామాలు తీవ్రంగా ఉంటాయి, శత్రువులు ఏడ్వాల్సిందే' అని ఇరాన్ వార్నింగ్ ఇచ్చింది. 'ఆపరేషన్ ట్రూ ప్రామిస్-4' పేరుతో పశ్చిమాసియాలో 27 అమెరికా స్థావరాలపై, యూఏఈలో జబెల్ అలీ పోర్టు, అబుదాబి విమానాశ్రయం, బుర్జ్ ఖలీఫాపై క్షిపణులు ప్రయోగించారు. బహ్రెయిన్, కువైట్‌లో సైరన్లు మోగిపోయాయి. ఇదిలా ఉంటే ఈ యుద్ధం నుంచి భారత్ కూడా చాలా విషయాలు తెలుసుకోవాలి. అందులో ముఖ్యమైనవి ఐదు. ఇజ్రాయెల్ ఐరన్ డోమ్ నుంచి సౌదీ, యూఏఈ, ఖతార్ వరకు ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు ఈ యుద్ధంలో పూర్తిగా విఫలమయ్యాయి. చైనా నుంచి తెచ్చుకున్న ఇరాన్ సిస్టమ్ కూడా డ్రోన్‌లు, క్షిపణులను అడ్డుకోలేదు, హెచ్చరికలు ఇవ్వలేదు. దుబాయ్, షార్జా, బహ్రెయిన్‌లో అమెరికా బేస్‌లు ఒకేసారి దాడి ఎదుర్కొన్నాయి. భారత్‌తోపాటు ప్రపంచ దేశాలు ఈ సాంకేతికతలపై పునరాలోచన చేయాలి. ఇరాన్ ప్రజల మద్దతు, మిసైల్ స్టాక్ ఉన్నంతవరకు ఇరాన్ పోరాటం కొనసాగించే అవకాశం కనిపిస్తోంది. పరాజయం అంగీకరించే సూచనలు కనిపించడం లేదు. సుదీర్ఘ యుద్ధంతో అమెరికా, ఇరాన్‌తోపాటు అమెరికా మద్దతు ఇస్తున్న ముస్లిం దేశాలు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉంది. ఇరాన్ 'యుద్ధం మీరు మొదలుపెట్టారు, మేం ముగింపు పలుకుతాం' అని హెచ్చరిస్తోంది. ఇక ఈ యుద్ధంలో న్యూక్లియర్ శక్తి ఉన్న పాకిస్తాన్ ఆటలో అరటిపండుగా మారింది. సౌదీతో డిఫెన్స్ అగ్రిమెంట్ చేసుకుంది. యూఏఈతో కూడా రక్షణ ఒప్పందాలు చేసుకుంటూ ఇజ్రాయెల్ పక్షాన హమాస్‌కు వ్యతిరేకంగా సిద్ధమైంది. ఏ పక్షాన అని తెలియకుండా మౌనంగా ఉంది. మరోవైపు ఎవరూ పాకిస్తాన్‌ను సాయం అంగడం లేదు. కనీసం పట్టించుకోవడం లేదు. రంజాన్ మాసంలో జరిగిన యుద్ధం షియాలను ఇరాన్ పక్షాన, సున్నీలను (సౌదీ, యూఏఈ తదితరులు) అమెరికా-ఇజ్రాయెల్ వైపు నడిపింది. ఖమేనీ మరణానికి షియాలు ప్రపంచ వ్యాప్తంగా నిరసనలు చేశారు, సున్నీలు మౌనంగా ఉన్నారు. ముస్లిం ఐక్యతకు ఈ యుద్ధం తీవ్ర దెబ్బ తీసింది. మొత్తంగా భారత దేశంలో విపక్షాల తీరు చూస్తుంటే.. యుద్ధం సాకుతో ఓటు బ్యాంకు పెంచుకునే ప్రయత్నం చేస్తున్నట్లు కనిపిస్తోంది. అలా కాకుండా దేశం కోసం, అదే సమయంలో తమకు అనుకూలంగా ఉండే అంశాలపై మాట్లాడితే కొంత లబ్ధి కలుగుతుంది.

## ఈటెల దారెటు

పార్టీ నుంచి బయటికి వచ్చారు. ఆ తర్వాత కమలం పార్టీలో చేరారు. 2023 లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో హుజురాబాద్, గజ్వేల్ నియోజకవర్గాలలో పోటీ చేసి ఓడిపోయారు. 2024 లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్ గిరి స్థానం నుంచి ఎంపీగా గెలిచారు. కమలం పార్టీలో ఉంటున్నప్పటికీ ఈటల రాజేందర్ కు సముచితమైన స్థానం లభించడం లేదని ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో రాజేందర్ గులాబీ గూటికి వెళ్తారని సోషల్ మీడియాలో ప్రచారం కూడా జరుగుతుంది. అయితే ఆయన కాంగ్రెస్ లోకి వెళ్లే ఛాన్స్ ఉందని మొన్నటిదాకా ప్రచార జరిగినప్పటికీ.. అలాంటి అవకాశం లేదని ఆయన మద్దతుదారులు అంటున్నారు. పురపాలక ఎన్నికల్లో ఆయన కేవలం మల్కాజి గిరి స్థానానికి మాత్రమే పరిమితం అయ్యారు. కరీంనగర్ లో జోక్యం చేసుకోకూడదని ఇప్పటికే ఆయనకు అధిష్టానం చెప్పినట్టు తెలుస్తోంది. స్టార్ క్యాంపెనర్ గా ఆయనకు అవకాశం కల్పించినప్పటికీ.. ఎక్కడికక్కడ బంధనాలు విధించినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే మున్సిపల్ ఎన్నికల్లో తన వర్గాన్ని కాపాడుకోలేదనే భావన రాజేందర్ లో ఉందని ఆయన వర్గీయులు అంటున్నారు. ఇటీవల పంచాయతీ ఎన్నికల్లో హుజురాబాద్లో పట్టు కోసం రాజేందర్ ప్రయత్నించినట్టు తెలుస్తోంది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తో ఈటల రాజేందర్ కు మధ్య ఉప్పు నిప్పు లాగా వ్యవహారం సాగుతోందని రాజకీయ వర్గాలలో ప్రచారం జరుగుతోంది. ఆ మధ్య బండి సంజయ్.. ఈటల రాజేందర్ పరోక్షంగా విమర్శలు కూడా చేసుకున్నారు. రాజేందర్ అయితే తన స్వరాన్ని పెంచి పేరు చెప్పకుండా బండి సంజయ్ వర్గం మీద తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. తన నియోజకవర్గంలో వేలు పెడితే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. ఈ పరిణామాలు మొత్తం ఈటెల రాజేందర్ వర్గీయులలో అంతర్మథనానికి కారణమైనట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో పార్టీలో ప్రాధాన్యం లేనప్పుడు.. గుర్తింపు ఇచ్చే పార్టీలోకి వెళ్లాలని ఈటెల రాజేందర్ మీద ఆయన అనుచరులు తీసుకొస్తున్నట్టు ప్రచారం జరుగుతుంది. సోషల్ మీడియాలో అయితే ఈటెల రాజేందర్ కు గులాబీ పార్టీ నుంచి ఆహ్వానాలు అందుతున్నట్టు తెలుస్తోంది. అందువల్లే ఈటల రాజేందర్ మౌనంగా ఉంటున్నట్టు తెలుస్తోంది. గతంలో బిజెపిలో చేరికల కమిటీ చైర్మన్ గా రాజేందర్ పనిచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా పర్యటించారు. పార్టీ బలోపేతానికి కృషి చేశారు.
ఎంపిగా కూడా గెలిచారు. కానీ ఆయనకు కేంద్ర కేబినెట్లో చోటు లభించలేదు. దీనికి తోడు రాష్ట్ర అధ్యక్ష పదవి కూడా ఆశించారు. అది కూడా ఆయనకు దక్కలేదు. రామచంద్రరావుకు బిజెపి స్టేట్ ప్రెసిడెంట్ పదవి ఇవ్వడం రాజేందర్ లో అసహనాన్ని కలిగించిందని ఆయన వర్గీయులు చెబుతుంటారు. తన ఆవేదనను అమిత్ షా వంటి నేతలతో చెప్పుకున్నప్పటికీ ఫలితం లేకుండా పోయిందని రాజేందర్ అనేక సందర్భాలలో తన అనుచరుల వద్ద వాపోయినట్టు తెలుస్తోంది. ఇటీవల స్థానిక ఎన్నికల్లో పార్టీ నాయకత్వం వ్యవహరించిన తీరు కూడా రాజేందర్ ను మనస్థాపానికి గురి చేసినట్టు సమాచారం. స్థానిక ఎన్నికల తర్వాత పార్టీలో రాజేందర్ అంత వ్యూహాత్మకంగా కనిపించడం లేదు. ఒకప్పుడు తెలంగాణ రాష్ట్రంలో కీలకమైన నాయకుడిగా ఎదిగిన రాజేందర్.. ఇప్పుడు కేవలం మల్కాజ్ గిరి పార్లమెంటు స్థానానికి పరిమితం కావడానికి ఆయన వర్గీయులు జీర్ణించుకోలేకపోతున్నారు. పార్టీ అధిష్టానం కావాలని ఇలా చేసిందా? వేరే వ్యక్తుల ఒత్తిడి వల్ల ఇలా చేస్తోందా? అనే ప్రశ్నలు కార్యకర్తల్లో వ్యక్తం అవుతున్నాయి. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ఉన్న మున్సిపల్ ఎన్నికలకు దూరంగా ఉండాలని రాజేందర్ ను పార్టీ అధిష్టానం ఆదేశించడం మింగుడు పడని విధంగా ఉందని ఆయన వర్గీయులు అంటున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ఆయన వర్గీయులకు అంతగా ప్రాధాన్యం ఇవ్వకపోవడం కూడా రాజేందర్ ను మనస్థాపానికి గురి చేసినట్టు తెలుస్తోంది. స్టార్ క్యాంపెనర్ గా రాజేందర్ ను పేర్కొన్నప్పటికీ.. కరీంనగర్ జిల్లాలో వేలు పెట్టకూడదని చెప్పడం ఒకరకంగా ఆయన వేగానికి స్పీడ్ బ్రేకర్ వేయడం లాంటిదేనని కార్యకర్తలు అంటున్నారు. అధిష్టానం వైఖరితో రాజేందర్ సీరియస్ గా ఉన్నారని.. త్వరలోనే ఆయన వేరే నిర్ణయం తీసుకోబోతున్నారని తెలుస్తోంది. ఇటీవల మున్సిపల్ ఎన్నికల్లో తన వర్గీయులకు ప్రాధాన్యం దక్కకపోవడంతో వారంతా కూడా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తరఫున బరిలోకి దిగారు. దీనికి తోడు ఆ మధ్య సోషల్ మీడియాలో రాజేందర్ కు వ్యతిరేకంగా ప్రచారం జరిగింది. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోనే హుజరాబాద్ అసెంబ్లీ స్థానం ఉంటుంది. ఈ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి రాజేందర్ అనేక పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయనకు ప్రత్యేకమైన వర్గం కూడా ఉంది. బిజెపిలో రాజేందర్ చేరినప్పుడు వారు కూడా కాషాయం కండువా కప్పుకున్నారు. కరీంనగర్ పార్లమెంటు స్థానం నుంచి గెలిచిన బండి సంజయ్ ప్రస్తుతం ఇక్కడ కేంద్ర మంత్రిగా కొనసాగుతున్నారు. బండి సంజయ్, ఈటెల రాజేందర్ మధ్య కోల్డ్ వార్ ఉండేది. ఇప్పుడు ఆ గ్యాప్ మరింత పెరిగింది. వీరిద్దరి మధ్య సయోధ్య కుదరచడానికి అనేకమంది నేతలు ప్రయత్నించినప్పటికీ అంతగా సక్సెస్ కాలేదు. ఆమధ్య ఈటెల రాజేందర్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన కొంతమంది నేతలు హైదరాబాదులోని షామీర్పేట ప్రాంతంలో భేటీ అయినట్టు వార్తలు వస్తున్నాయి. వారందరికీ అండగా ఉంటానని బండి సంజయ్ హామీ ఇచ్చినట్టు తెలుస్తోంది. అయితే కొద్ది రోజులకే గ్రామపంచాయతీ ఎన్నికలు వచ్చాయి. ఈ ఎన్నికల్లో తన వర్గీయులను రాజేందర్ రంగంలోకి దింపారు. కొన్ని పంచాయతీలలో రెబల్ అభ్యర్థులుగా కూడా పోటీలో ఉంచారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఈటల రాజేందర్ ను హుజరాబాద్ నియోజకవర్గం లోకి ప్రవేశించకుండా కేంద్ర మంత్రి బండి సంజయ్ వర్గం అడ్డుకున్నట్టు ప్రచారంలో ఉంది. ఈ పరిణామం రాజేందర్ ను ఇబ్బందికి గురి చేసిందని.. పార్టీ నాయకత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రావడంతో ఆయన నియోజకవర్గానికి దూరంగా ఉంటున్నట్లు తెలుస్తోంది. దీంతో మల్కాజిగిరి పార్లమెంటు స్థానానికే రాజేందర్ పరిమితమయ్యారు. ఇటీవల సోషల్ మీడియాలో రాజేందర్ మీద తీవ్రస్థాయిలో పోస్టులు కనిపిస్తున్నాయి. వాటిపై ఆయన స్పందించారు. అవన్నీ కూడా పిచ్చోళ్ళు పెట్టే పోస్టులని ఆయన వ్యాఖ్యానించారు. ఇక అప్పట్లో కేంద్ర మంత్రి బండి సంజయ్ పీ ఆర్ ఓ ను ఉద్దేశించి రాజేందర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. అప్పట్లో ఆ రాజేందర్ చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టించాయి. అంతేకాదు తాను ఏ పార్టీలో ఉన్నాననే విషయం ప్రజలు తేల్చుకుంటారని రాజేందర్ అన్నారు. సోషల్ మీడియా పోస్టులు ఆధారంగా రాజకీయ నిర్ణయాలు తీసుకోవడం సరైన విధానం కాదని రాజేందర్ పేర్కొన్నారు. అయితే ఆయనకు గులాబీ పార్టీ నుంచి ఆహ్వానం లభించిందని.. త్వరలోనే ఆయన ఆ పార్టీలో చేరబోతున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి.


## క్యూర్.. ప్యూర్ రీజియన్ల అడుగులు

జయభేరి, హైదరాబాద్ మార్చి 6 :

హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం ఓఆర్ఆర్ ఆర్ఆర్ఆర్ మధ్య 1.10 లక్షల ఎకరాల్లో భారీ గ్రీన్‌బెల్ట్‌ను ఏర్పాటు చేస్తోంది. దీనిని 110 హరిత జోన్లుగా విభజించి ఆక్వా, అగ్రి బిజినెస్‌లను ప్రోత్సహించనుంది. రూ. 35 వేల కోట్లతో నిర్మిస్తున్న 340 కి.మీ రీజినల్ రింగ్ రోడ్డు ద్వారా 24 అర్బన్ క్లస్టర్లను అనుసంధానిస్తూ, కాలుష్య రహిత అభివృద్ధిని సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు.
తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ చుట్టూ ఉన్న ప్రాంతాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసేందుకు కసరత్తు చేస్తోంది. అందులో భాగంగా.. క్యూర్.. ప్యూర్.. రేర్ ప్రాంతాలుగా విభజించి అభివృద్ధికి ప్రణాళికలు రచిస్తోంది.
క్యూర్ ప్యూర్ రీజియన్ల మధ్యలో గ్రీన్ బెల్ట్ ఏర్పాటు చేసేందుకు సిద్ధమైంది. దీని పరిధిలో అందుబాటులోకి వచ్చే లక్షా పది వేల ఎకరాల భూముల్లో చెరువులతో పాటు ఆక్వా కల్చర్, అగ్రి బిజినెస్ వంటి వ్యాపారాలను చేయవచ్చు. ఈ భూములను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో కానీ.. ప్రైవేటు, కార్పొరేటు సంస్థలకు లీజుకివ్వడం ద్వారా గానీ గ్రీనరీని పెంపొందించి ఆర్ఆర్ఆర్ లోపల భాగంలో సకాలంలో వర్షాలు కురిసేలా చర్యలు తీసుకోనున్నారు.
ఓఆర్ఆర్ చుట్టూ ప్రస్తుతం అంతగా గ్రీన్‌బెల్ట్ లేకపోవడం, ఇండ్లు, పరిశ్రమలు పెరుగుతుండడంతో కాలుష్యం పెరుగుతుందని చెబుతున్నారు. ఓఆర్ఆర్ ఆర్ఆర్ఆర్ మధ్యలో గ్రీన్‌బెల్ట్ వల్ల ప్రయోజనాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఔటర్ రింగు రోడ్డు, రీజినల్ రింగురోడ్డు మధ్య 110 ప్రాంతాలను హరిత జోన్లుగా ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గ్రీన్‌బెల్ట్‌కు కేటాయించనున్న 1.10లక్షల ఎకరాలను 110 గ్రీన్‌జోన్లుగా విభజించనున్నారు.
ఇలా విభజిస్తే.. ప్రతి 3.5 కిలోమీటర్లకు ఒక హరిత జోన్ ఏర్పాటు కానుంది. ఇందులో ఆక్వా, అగ్రి బిజినెస్, చెట్లతో ప్రతి జోన్ ప్రాణవాయువు కేంద్రంగా మార్చేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. ఇక రీజినల్ రింగు రోడ్డును రూ. 35 వేల కోట్ల వ్యయంతో 340 కిలో మీటర్ల మేర నిర్మిస్తున్నారు. 24 అర్బన్ క్లస్టర్లు, 208 గ్రామాలను కనెక్ట్ చేస్తున్నారు. దక్షిణ తెలంగాణ పరిధిలో 182 కి.మీ గ్రీన్‌ఫీల్డ్ రింగ్‌రోడ్డు ప్రధాన రహదారిగా మారనుంది.
ఔటర్ రింగు రోడ్డుతో పాటు చౌటుప్పల్, శివన్నగూడ, కందుకూరు, ఆమన్‌గల్, చేవెళ్ల, శంకర్‌పల్లి, సంగారెడ్డి మీదుగా వెళ్లనుంది. ఉత్తర తెలంగాణ పరిధిలో 158 కి.మీ మేర ఈ రోడ్డును నిర్మిస్తున్నారు. గజ్వేల్, సంగారెడ్డి, నర్సాపూర్, తూప్రాన్, యాదాద్రి, ప్రజ్ఞాపూర్, భువనగిరి మీదుగా చౌటుప్పల్ వద్ద ఈ రోడ్డు కలుస్తుంది. ప్రస్తుతం ఆ ప్రాజెక్టు పనులు కొనసాగుతున్నాయి.

# యాదాద్రిలో నేత్రపర్వంగా ఊంజల్ సేవ

- శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి నిత్యరాబడి రూ.13.16లక్షలు



**జయభేరి, యాదగిరిగుట్ట, మార్చి 06 :**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయంలో శ్రీఆండాల్ అమ్మవారికి ఊంజల్ సేవను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం అమ్మవారికి ప్రీతికరమైన రోజు కావడంతో శ్రీపాంచరాత్రాగమన ప్రకారం కొండపైన అద్దాల మండపంలో ఊంజల్ సేవను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు అమ్మవారికి మంగళ హారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

**యాదగిరీశుడికి నిత్యపూజలు..**

శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారికి నిత్యపూజలు కొనసాగుతున్నాయి. శుక్రవారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం, అర్చనను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతించారు.

శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగిన శ్రీసుదర్శన నారసింహ హోమం,నిత్య కల్యాణం, నిత్య బ్రహ్మోత్సవం,వెండి జోడి సేవ,స్వర్ణ పుష్పార్చన, శ్రీసత్యనారాయణస్వామి వ్రత పూజలు నిర్వహించారు.

అనంతరం కొండపైన కొలువైన శ్రీపర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకొని ఆలయంలో జరిగిన నిత్యపూజలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**నిత్యరాబడి..**

శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారికి శుక్రవారం నిత్య రాబడిలో భాగంగా రూ.13,16,781 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధాన బుకింగ్ ద్వారా రూ.88,850,బ్రేక్ దర్శనం ద్వారా రూ.80,700, శ్రీసత్యనారాయణ వ్రతాల ద్వారా రూ.81,000,రూ.150 వీఐపీ దర్శనం ద్వారా రూ.1,20,000, కొండపైకి వాహన ప్రవేశం ద్వారా రూ.2,80,500, సువర్ణ పుష్పార్చన ద్వారా రూ.43,600, ప్రసాద విక్రయం ద్వారా రూ.4,54,670, కల్యాణకట్ట ద్వారా రూ.36, 000తో పాటు వివిధ శాఖలు,పాతగుట్ట ఆలయం ద్వారా ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.

**యాదగిరీశుడికి విరాళం..**

శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి అన్నప్రసాదానికి భక్తుడు విరాళం అందజేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని తూ.గో.జిల్లా వెట్లపాలెంకు చెందిన అమటం శైలేంద్రనాథ్, పద్మావతి,షణ్ముక్, మయూర్ స్వామివారి అన్నప్రసాదానికి రూ.లక్ష విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు.

# ప్రజలకు అందుబాటులో ఉంటా.. సమస్యలు పరిష్కరిస్తాం

- యాదగిరిగుట్టలో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో బీర్ల అయిలయ్య

**జయభేరి, యాదగిరిగుట్ట :**



నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తెలిపారు. శుక్రవారం యాదగిరిగుట్ట మున్సిపల్ పరిధిలోని యాదగిరిపల్లిలో ప్రజాపాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి వాణీభరత్‌గౌడ్ జెండా ఊపి ప్రారంభించగా బీర్ల అయిలయ్య పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మున్సిపల్ సిబ్బందితో కలిసి చీపురు పట్టి చెత్తను ఊడ్చి ఆటోలో వేశారు. ప్రజాపాలనప్రగతి ప్రణాళిక ప్రతిజ్ఞ చేసిన అనంతరం బీర్ల అయిలయ్య మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిందని తెలిపారు. పట్టణాలు,గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలని, అభివృద్ధి పనులు వేగంగా కొనసాగాలనేది ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. యాదగిరిగుట్ట పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని,ప్రజల సహకారంతోనే స్వచ్ఛమైన,అభివృద్ధి చెందిన యాదగిరిగుట్టను నిర్మించగలమన్నారు. ప్రతి వార్డులో పరిశుభ్రత, మౌలిక వసతుల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సేవలు అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. మున్సిపల్ కార్మికులు పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు చేస్తున్న సేవలు ఎంతో ప్రశంసనీయమని కొనియాడారు. ప్రజలు కూడా పరిశుభ్రతపై అవగాహన కలిగి చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఆయన వెంట ఆలేరు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఐనాల చైతన్యరెడ్డి, మున్సిపల్ కమిషనర్ లింగస్వామి,వైస్ చైర్మన్ బరిగె రమ్య రామచందర్, మున్సిపల్ కౌన్సిలర్లు బోడ రాధాసురేష్,బూడిద మధు, కాటబత్తిని స్వప్న ఆంజనేయులు,బిట్టు సరోజ, పెలిమెల్లి లావణ్య_శ్రీధర్, సాధునేని ధనలక్ష్మి మధుకర్, ముక్కెర్ల మల్లేష్ యాదవ్, బబ్బూరి శ్రీధర్, కాంగ్రెస్ నేతలు చీర శ్రీశైలం, గౌలీకార్ రాజేష్‌తో పాటు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



**ఇందిరమ్మ ఇల్లు ప్రారంభించిన ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య**

యాదగిరిగుట్ట పట్టణ పరిధిలోని 3వ వార్డులో ఎక్కల పద్మకు చెందిన ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా పద్మకు పట్టువస్త్రాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బీర్ల అయిలయ్య మాట్లాడుతూ పేద ప్రజలకు సొంతింటి కల నెరవేర్చాలనే లక్ష్యంతో ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్లను అందిస్తున్నామన్నారు. ప్రతి పేద కుటుంబం గౌరవంగా జీవించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



# జిల్లా ఆటో యూనియన్ల జేఏసీ ప్రధాన కార్యదర్శిగా కెంగూరి రాము

- నియామక ఉత్తర్వులను అందజేసిన తెలంగాణ యునైటెడ్ ఆటో ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్స్

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా తెలంగాణ ఆటో యూనియన్ల జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ కేంద్రానికి చెందిన కెంగూరి రామును రాష్ట్ర ఆ సంఘం శుక్రవారం ఉత్తరువును విడుదల చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్, ఉపాధ్యక్షుడు దస్తగిరి నియామక పత్రాన్ని కెంగూరి రాముకు అందజేశారు. దేవరకద్ర కు చెందిన కెంగూరి రాము తెలంగాణ ఆటో యూనియన్ల జేఏసీ ప్రారంభం నుండి యూనియన్ లో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. ఇకముందు కూడా అదే స్ఫూర్తితో ఆటో యూనియన్ అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని ఆ యూనియన్ రాష్ట్ర నాయకులు రాముకు అందజేసిన ఉత్తర్వులో పేర్కొన్నారు. ఈ మేరకు ఆయా మండలాలలో ఆటో యూనియన్ల జేఏసీ కార్యవర్గాలను ఏర్పాటు చేయాలని వారు సూచించారు. అలాగే ఆటో యూనియన్ తరపున భవిష్యత్తు పోరాటాల కూడా సిద్ధం కావాలని వారు సూచించారు. ఈ సందర్భంగా కెంగూరి రాము మాట్లాడుతూ ఆటో యూనియన్ల జేయసి అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. తమపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తానన్నారు. ఈ విషయంలో ఆటో యూనియన్ల వారంతా తమకు సహకారం అందించాలని కెంగూరి రాము కోరారు.

# ప్రజా పాలనలో మంత్రితో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్




**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా కలెక్టరేట్ లో శుక్రవారం రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధ్యక్షతన ఉమ్మడి పాలమూరు జిల్లా కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, అధికారులతో నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ఉమ్మడి పాలమూరు జిల్లా శాసనసభ్యులతో కలిసి దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రాష్ట్రప్రభుత్వం నిర్దేశించిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను విజయవంతంగా అమలు చేయాలని మంత్రివర్యులు దామోదర్ రాజనర్సింహ అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అధికార యంత్రాంగం సంసిద్ధంగా ఉండాలని, వేసవి ప్రారంభమవుతున్న నేపథ్యంలో ముందస్తుగా నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. 99 రోజుల పాటు నిర్వహించే ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు సమన్వయంతో కష్టపడి పని చేయాలని కోరారు.

# అధ్వానమైన స్థితిలో సమ్మంగిపాలెం పారిశుధ్యం

- స్పందించని పంచాయతీ కార్యదర్శి

**జయభేరి, పరవాడ:**



పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం పంచాయతీ పరిధిలోని సమ్మంగిపాలెం గ్రామంలో పారిశుధ్య పరిస్థితులు రోజురోజుకు అధ్వాన్నంగా ఉన్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని డ్రైనేజీ కాలువలు చెత్తతో నిండిపోవడంతో మురికినీరు సరిగా బయటకు వెళ్లకుండా గ్రామస్థులు వాపోతున్నారు మురికి కాలువల్లో పేరుకుపోయిన చెత్త కారణంగా తీవ్ర దుర్వాసనలు వ్యాపించడంతో పాటు దోమలు విపరీతంగా వృద్ధి చెందడంతో చిన్నపిల్లలను దోమలు ఎక్కువగా కుట్టడంతో వారు జ్వరాలు, ఇతర ఆరోగ్య సమస్యల బారిన పడుతున్నారని గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం అనంతరం పరిస్థితి మరింత దయనీయంగా మారిందని వారు తెలిపారు. ఈ సమస్యపై పలుమార్లు పంచాయతీ కార్యదర్శికి, పంచాయతీ పాలకవర్గానికి ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. సంవత్సరానికి ఒక్కసారే డ్రైనేజీ కాలువల పూడికతీత పనులు చేపడుతున్నారని, మిగతా సమయాల్లో పారిశుధ్య పనులు పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని గ్రామస్థులు ఆరోపించారు. పారిశుధ్య పూడికతీత పనులు నిర్వహించకపోయినా,ఇంటి పన్నులు మాత్రం కట్టాలని ప్రచారం చేయడం పట్ల గ్రామస్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వెంటనే పారిశుధ్య పూడికతీత పనులు చేపట్టి డ్రైనేజీ కాలువలను శుభ్రం చేయాలని, గ్రామంలో ఉన్న మురికినీటి కాలువలో బ్లీచింగ్ పౌడర్ చల్లి దోమల నివారణ చర్యలు తీసుకోవాలని, ఫాగింగ్ నిర్వహించాలని గ్రామ ప్రజలు ప్రభుత్వ ఉన్నతాధికారులను కోరుతున్నారు.గ్రామంలో వ్యాధులు వ్యాప్తి చెందకముందే సంబంధిత అధికారులు స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని సమ్మంగిపాలెం గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



# లంకెలపాలెం ఎస్ఎస్ పరిధిలో నేడు విద్యుత్ సరఫరాకి అంతరాయం

**జయభేరి, పరవాడ:**

లంకెలపాలెం ఎస్ఎస్ నిర్వహణ పనులు మరియు నూతన 33కేవీ బ్రేకర్ ఎరెక్షన్ కారణంగా శనివారం ఉదయం 10:00నుండి మధ్యాహ్నం 01:00వరకు ఏపీఈపీడీసీల్ ద్వారా 33/11కేవీ లంకెలపాలెం ఎస్ఎస్ ఎల్సి తీసుకోవాలని ప్రతిపాదించబడింది. కాబట్టి పెదముషిడివాడ పంచాయతీ మరియు వారి నివాస గ్రామాలలో గండివానిపాలెం, నక్కవానిపాలెం, విజయరాంపురం, పచ్చికోరువానిపాలెం, ఇమ్మ్రిపాలెం, గొన్నవానిపాలెం, ఫార్మసిటీ కాలనీ, కన్నూరు, మంత్రిపాలెం,లంకెలపాలెం మొత్తం ప్రాంతాలు వినాయక నగర్, శ్రీ రామ్ నగర్ కాలనీ, గంజిపేట, శ్రీ రంగ నగర్ కాలనీ, లంకెలపాలెం పారిశ్రామిక ప్రాంతం, గొల్లపేట, గంగిరెడ్ల కాలనీ, లంకెలపాలెం జంక్షన్, లంకెలపాలెం పాత గ్రామాలలో విద్యుత్ సరఫరాకి అంతరాయం కలగొచ్చు అని కశింకోట ఏపీఇపిడీసీల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.మురళి కృష్ణ తెలిపారు.

# ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు



**జయభేరి, యాదగిరిగుట్ట, మార్చి06 :**

యాదగిరిగుట్టలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. యాదగిరిగుట్ట పట్టణంలోని ఆర్టీసీ డిపోలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సతీమణి,బీర్ల ఫౌండేషన్ చైర్‌పర్సన్ బీర్ల అనిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ మహిళా కండక్టర్లకు చీరలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతూ సమాజాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. మహిళల సాధికారత కోసం ప్రభుత్వం,సామాజిక సంస్థలు కలిసి పనిచేయాలన్నారు. మహిళల అభివృద్ధికి తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్‌పర్సన్ గుండ్లపలి వాణిభరత్ గౌడ్, వైస్ ఛైర్మన్ బరిగె రమ్యరాంచందర్, మహిళా కండక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# అలియాబాద్ మున్సిపాలిటీలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక



**జయభేరి, శామీర్ పేట్, మర్చి 6:**

ప్రణాళికలో భాగంగా 99 రోజుల ప్రత్యేక కార్యక్రమానికి అధికార యంత్రాంగం శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ చైర్మన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి అధికారులతో కలిసి శ్రమదానం నిర్వహించారు. అనంతరం పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత అనేది అందరి బాధ్యత అని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే వ్యాధులను అరికట్టవచ్చునని తెలిపారు. అందరి సహకారంతో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి అలియాబాద్ మున్సిపాలిటీని ప్రథమ స్థానంలో నిలబెడతామని వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ చంద్రశేఖర్, వైస్ చైర్మన్ కన్ రెడ్డి మాలతి మాధవ్ రెడ్డి , కౌన్సిలర్లు గాదె వెంకటేశ్, కైరా గణేష్, ముద్దం సుధాకర్ రెడ్డి, కోడూరి మౌనిక, సరసం వనజ, జశ్వంత్ రెడ్డి, అప్పవత్ వెంకటేష్,ఏ ఇ ఇ సన షాహిన్, ఇంచార్జ్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, ఇంచార్జ్ రెవెన్యూ అధికారి వేణు గోపాల్, ఇంచార్జ్ రెవెన్యూ ఇన్స్ స్పెక్టర్ విజయ్ కుమార్, నాయకులు కంఠం కృష్ణారెడ్డి, కోడూరి దినేష్, తూము శ్యామ్, మహిళ సంఘాల నేతలు, పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

- ముదుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాం రవి
- అధికారులతో కలిసి రహదారులను శుభ్రం చేసిన చైర్మన్



**జయభేరి, శామీర్ పేట్, మర్చి 6:**

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ముదుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాం రవి అన్నారు. 99 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా ముదుచింతలపల్లిలో వైస్ చైర్మన్ మెర్సుబాయి శశిరేఖ, కమిషనర్ పవన్ కుమార్ తో కలిసి రహదారులను శుభ్రం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ముదుచింతలపల్లి మున్సిపాలిటీని అందరి సహకారంతో అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే అధికారులు, స్థానిక సభ్యులతో కలిసి రహదారులను శుభ్రం చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ర్యాకల నీరజ్ గౌడ్, నవీన్ నాయక్, ముద్దం పాపిరెడ్డి, వంగ ప్రియాంక రెడ్డి, చిన్నలచ్చ సరిత శ్రీనివాస్, రమేష్, జ్యోతి, స్వామి, గోవర్ధన్ రెడ్డి, పెద్దిరెడ్డి శ్రీలత, లత, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాల అమలు కోసమే ప్రజా పాలన

- దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్
- దేవరకద్రలో ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమం

**జయభేరి, దేవరకద్ర :**




ప్రజా సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల అమలు కోసమే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని చేపట్టిందని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అన్నారు. దేవరకద్రలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద శుక్రవారం సాయంత్రం ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.పట్టణాలు, గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి పరచాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వ ఈ ప్రత్యేక కార్యాచరణ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం, సమగ్ర అభివృద్ధిని ప్రధానంగా లక్ష్యంగా తీసుకొని ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు.



99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ గా 5 దశల్లో 5 ప్రత్యేక కార్యక్రమాలు 99 రోజులు జరుగుతాయని తెలిపారు.ఏప్రిల్ 2 గ్రామసభలు, గ్రామస్థాయి కార్యక్రమాలు, ఏప్రిల్ 16 మండల స్థాయి కార్యక్రమాలు, మే 2 నియోజకవర్గస్థాయి కార్యక్రమాలు, మే 22 జిల్లాస్థాయి కార్యక్రమాలు, జూన్ 2 రాష్ట్ర ఆవిర్భావ ప్రత్యేక కార్యక్రమాలు, రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరుగుతాయని తెలిపారు.99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించే ప్రతి కార్యక్రమాలను..అధికారులు అంకిత భావంతో పని చేసి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని కోరారు. ప్రజాపాలనపట్టణ ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో పారిశుధ్యం, ఫైళ్ల క్లియరెన్స్, ఆరోగ్యం, అరైవ్ & అలైవ్ (రోడ్డు భద్రత), సంక్షేమం, పిల్లల రక్షణ, డ్రగ్స్ నిర్మూలన, రైతు సంక్షేమం, వ్యవసాయం, విద్య, యువత, క్రీడలు, మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, రాష్ట్ర అభివృద్ధి కోసం చేసే ఈ ప్రణాళికలో ప్రజలందరూ అందరు భాగస్వాములు కావాలన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 10 లక్షల వరకు ఆరోగ్యశ్రీ, 200 యూనిట్ల ఉచిత కరెంట్, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, 2 లక్షల రైతు రుణమాఫీ, క్వింటాల్ కు 500/ రూపాయల బోనస్, 70 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు, కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇండ్లు, హాస్టల్ లో ఉన్న విద్యార్థులకు మెస్ ఛార్జీలు పెంపు, కాస్మోటిక్ చార్జీలు పెంపు, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు వంటి సంక్షేమ పథకాలను విజయవంతంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు.

పట్టణ ప్రాంతాల్లో పరిశుభ్రత, శానిటేషన్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడం ద్వారా ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కాలనీలు, వీధులు పరిశుభ్రంగా ఉండేలా మున్సిపల్ యంత్రాంగం సమర్థవంతంగా పనిచేయాలని, ప్రతి పౌరుడు కూడా పరిశుభ్రతను కాపాడటంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

అనంతరం దేవరకద్రలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణ పనులను పరిశీలించారు. అలాగే ఆస్పత్రి వద్ద నిర్వహించిన స్వచ్ఛత కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ కౌన్సిలర్లు అధికారులు మున్సిపల్ సిబ్బంది ప్రజా ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే జిఎంఆర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## మన్యంకొండలో వైభవంగా స్త్రీ పుష్పయాగం

- పూల అలంకరణలో వెంకటేశ్వర స్వామి సమేత అలివేలు మంగమ్మ దర్శనం

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లాలోని ప్రధాన దేవాలయమైన మన్యం కొండ శ్రీ అలివేలు మంగతాయారు దేవస్థానంలో శుక్రవారం ఉత్సవాలలోని చివరి ఘట్టంగా స్త్రీ పుష్పయాగం పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గత కొన్ని రోజులుగా అమ్మవారి బ్రహ్మోత్సవాలు జరుగుతున్న విషయం విదితమే. అందులో భాగంగానే చివరి రోజు ఈ పూజా కార్యక్రమాన్ని సాంప్రదాయ రీతిలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారు శ్రీ వెంకటేశ్వర స్వామి సమేత పూల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్, వంశపారం పర్య ధర్మకర్త అళహరి మధుసూదన్ కుమార్, అళహరి రామకృష్ణ, ఈవో శ్రీనివాసరాజు, ప్రధాన పూజారులు రాజేష్, నరసింహయ్య, పర్యవేక్షకుడు నిత్యానంద చారిలతో పాటు దేవస్థానం పురోహితులు, సిబ్బంది తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆస్పత్రి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే జిఎంఆర్



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలోని స్థానిక పెద్ద చెరువు వద్ద నిర్మించే 100 పడకల ఆసుపత్రిని శుక్రవారం దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) పరిశీలించారు. గత కొన్ని రోజులుగా ఈ 100 పడకల ఆసుపత్రి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. అయితే వివిధ కార్యక్రమాలలో పాల్గొనడానికి దేవరకద్ర కు వచ్చిన ఎమ్మెల్యే జిఎంఆర్ స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి అక్కడికి వెళ్లి ఆస్పత్రి పనులను పరిశీలించారు. పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఆస్పత్రి నిర్మించే మ్యాపును ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాపతినిధులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రగతి ప్రణాళిక విజయవంతం చేసేందుకు కృషి చేద్దాం

- చిన్న వడ్డేమాన్ సర్పంచ్ వట్టెం స్వప్న శివకుమార్




**జయభేరి, దేవరకద్ర:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 99 రోజులు పాటు నిర్వహించే ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు సమన్వయతో కష్టపడి పని చేద్దామని మహబూబ్ నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం చిన్న వడ్డేమాన్ సర్పంచ్ వట్టెం స్వప్న శివకుమార్ కోరారు. చిన్న వడ్డేమాన్ లో శుక్రవారం ప్రజా పాలన ప్రణాళికలో భాగంగా మొదటి దశ ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి సర్పంచ్ ప్రసంగించారు. గ్రామాభివృద్ధే లక్ష్యంగా పెట్టుకొని ప్రభుత్వం ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమ విజయవంతానికి అందరం సంపూర్ణ సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వట్టెం స్వప్న శివకుమార్ తో పాటు పంచాయితీ కార్యదర్శి కేశవులు,ఉప సర్పంచ్ వినోద్, వార్డు సభ్యులు దేవమ్మ,కల్పన,చిన్నారి,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా శివపార్వతుల కళ్యాణం

- శివ పార్వతుల కళ్యాణం విజయవంతం ప్రత్యేక ధన్యవాదాలు



**జయభేరి, చింతపల్లి :**

ప్రతి ఒక్కరు శ్రీ శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి ఆశీస్సులు పొందాలని తీదేడు గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి అన్నారు. శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా గుట్ట పైన నిర్వాహకులు అంగరంగ వైభవంగా శివ పార్వతుల కళ్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి అని ఆమె అన్నారు. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంత లభిస్తుందని అన్నారు. ఈ గుట్టపై శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం శివుడు,భవానీల కూడిన ప్రసిద్ధ శైవ క్షేత్రం అన్నారు. శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి దేవాలయం వద్ద శివ పార్వతుల కళ్యాణ మహోత్సవం విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇడబోయిన వెంకటయ్య యాదవ్,గ్రామ పాలక వర్గం,గ్రామ పెద్దలు, గ్రామ యువకులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



## మాజీ మంత్రి హరీష్ రావుని కలిసి ఆశీర్వాదం తీసుకున్న రుప్లా నాయక్

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మున్సిపాలిటీ 16వ వార్డు కౌన్సిలర్ కేతవత్ రుప్లా నాయక్ మాజీ మంత్రివర్యులు సిద్దిపేట శాసనసభ్యులు హరీష్ రావు ని మర్యాద పూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా 16వ వార్డు కౌన్సిలర్ గా BRS పార్టీ విజయం గురించి చర్చించడం జరిగింది. కౌన్సిలర్ కేతావత్ రుప్లా నాయక్ ని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో మాధవరం నరసింహ రావు, సోములు, శ్రీధర్ రావు, చిట్టిపోలు శ్రీధర్ తదితరులు ఉన్నారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ ఎం కె ఆర్ ప్రభుత్వ డీగ్రీ కళాశాల (స్వ), దేవరకొండ లో ఈరోజు ప్రభుత్వం ఆదేశించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని కళాశాల లోని ఎన్. ఎస్. ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించడం జరిగింది. పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ డా. రమావత్ రవి కళాశాల అధ్యాపక అధ్యాపకేతర విద్యార్థుల తో కలిసి ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశించిన ఈ 10 రోజుల కార్యాచరణ వల్ల పెండింగ్ ఫైల్లు, పారిశుద్యం, అసంపూర్ణ నిర్మాణ సంబంధ కార్యక్రమాలు, మరమ్మత్తులు వంటి వివిధ కార్యక్రమాలను పూర్తి చేయడానికి ఇది చక్కని వేదిక అన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ప్రతిజ్ఞ చేసారు.

## రేపటి మహా విజ్ఞాపన సభను విజయవంతం చేయండి

- 2003 డీఎస్సీ గజ్వేల్ డివిజన్ అధ్యక్షుడు కుకునూరి శేఖర్

**జయభేరి, గజ్వేల్, మార్చి 06 :**



కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం (CPS) అమలు కంటే ముందు (సెప్టెంబర్ 1 2004 కంటే ముందు) నోటిఫికేషన్ వచ్చి, ఆ తర్వాత నియామకమైన డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం వర్తింపచేయాలని డీఎస్సీ 2003 గజ్వేల్ డివిజన్ అధ్యక్షులు కుకునూరి శేఖర్ కోరారు. ఈరోజు సాయంత్రం గజ్వేల్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సుమారు 21సంవత్సరాల క్రితం ఉపాధ్యాయులుగా నియామకమైన DSC 2003 ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు పాత పెన్షన్ ఇప్పటికీ ఒక కళగానే మారిందని, ఉపాధ్యాయులుగా నియామకమైనప్పటినుండి ప్రభుత్వాలకు ఎన్నో వినతులు, విజ్ఞప్తులు చేసిన ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం చాలా బాధాకరమని, అంతేకాకుండా నోటిఫికేషన్ ఆధారంగా పెన్షన్ ఇవ్వాలని కేంద్రం ఇచ్చిన మెమో 57/4,57/5 ప్రకారం హక్కుగా రావాల్సిన పాత పెన్షన్ అమలు చేయడంలేదని, అదేవిధంగా హైకోర్టు ఇచ్చిన తీర్పును కూడా ప్రభుత్వము అమలు చేయకపోవడం కోర్టు ధిక్కరణ అవుతుందని, దీనికి ప్రధాన కారణం సమస్య పట్ల ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేకపోవడమేన్నారు , సగం సర్వీస్ పూర్తయ్యే, రిటైర్మెంట్ అవుతున్నా , ఇప్పటి వరకు పాత పెన్షన్ అమలు చేయకపోవడం చాలా బాధాకరమన్నారు. ఈ విధంగా ప్రభుత్వాలు చేస్తున్న నిర్లక్ష్యానికి నిరసనగా ఈ నెల 7వ తేదిన రాష్ట్ర రాజధాని హైదరాబాదులో ఇందిరా పార్క్ దగ్గర తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం పాత పెన్షన్ ఇవ్వాలని కోరుతూ మహా విజ్ఞాపన సభ నిర్వహించడం జరుగుతుందని, దీనికి ప్రతి ఉపాధ్యాయుడు ఒక ఉద్యమకారుడుగా మారి పాత పెన్షన్ పోరాట సాధన లో పాలు పంచుకోవాలన్నారు. ఈ సభకు జిల్లాలోని ,గజ్వేల్ డివిజన్ లోని డీఎస్సీ 2003 ఉపాధ్యాయులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు.

## బ్రహ్మోత్సవాలకు రావాలని కేసీఆర్‌కు ఆహ్వానం

- వేద ఆశీర్వచనం, శేష వస్త్రం, ప్రసాదం అందజేసిన అర్చకులు
- మార్చి 8 నుంచి 19 వరకు నాచారం గుట్టలో వార్షిక బ్రహ్మోత్సవాలు
- మాజీ మంత్రి హరీష్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డికి కూడా ఆహ్వానం

**జయభేరి, గజ్వేల్, మార్చి 06 :**



సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం నాచారం గుట్టలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో మార్చి 8 నుంచి 19 వరకు నిర్వహించనున్న వార్షిక బ్రహ్మోత్సవలు జరగనున్నాయి. బ్రహ్మోత్సవాలకు హాజరుకావలసిందిగా మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావును దేవస్థానం ప్రతినిధులు ఆహ్వానించారు. అలాగే మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు, దుబ్బాక శాసనసభ్యులు కొత్త ప్రభాకర్‌రెడ్డిని కూడా బ్రహ్మోత్సవాలకు విచ్చేయాలని కోరుతూ ఆహ్వానం అందజేశారు. ఈ సందర్భంగా దేవస్థానం చైర్మన్ బి. రంగాచారి, కార్యనిర్వహణ అధికారి పల్లెర్ల రవీందర్, సహాయకులు సుధాకర్, రిటైర్డ్ ఉప ప్రధాన అర్చకులు కృష్ణమాచార్యులు, పురోహితులు గోపాలకృష్ణ శర్మ, నాగరాజు శర్మలు కలిసి వారికి వేద ఆశీర్వచనం అందించి స్వామి వారి శేష వస్త్రం, ప్రసాదం అందజేశారు. బ్రహ్మోత్సవాలను భక్తుల సమక్షంలో ఘనంగా నిర్వహించేందుకు దేవస్థానం అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

# విద్యార్థులకు సోషల్ మీడియా బ్యాన్

**జయభేరి, విజయవాడ మార్చి 6 :**




పిల్లల భవిష్యత్తు, వారి మానసిక ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోషల్ మీడియా వినియోగంపై కీలక వ్యాఖ్యలు చేశారు. 13 ఏళ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియా వాడకంపై నిషేధం విధిస్తామని ప్రకటించారు. చిన్న వయసులోనే సామాజిక మాధ్యమాలకు అలవాటు పడటం వల్ల పిల్లల ప్రవర్తనలో ప్రతికూల మార్పులు వస్తున్నాయని, వారు దారి తప్పకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ క్రమంలో రాష్ట్రంలో చిన్న పిల్లల సోషల్ మీడియా వినియోగాన్ని నియంత్రించేందుకు కఠిన చర్యలు తీసుకోబోతున్నట్లు ప్రకటించారు.ముఖ్యంగా 13 ఏళ్ల లోపు పిల్లలు సామాజిక మాధ్యమాలను వాడకుండా పూర్తిగా నిషేధించాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. అలాగే, 13 నుండి 16 ఏళ్ల మధ్య వయస్సు గల పిల్లలు సోషల్ మీడియా వినియోగించడంపై ఎలాంటి ఆంక్షలు విధించాలనే అంశంపై కూడా ప్రభుత్వం తీవ్రంగా కసరత్తు చేస్తోందని సీఎం చంద్రబాబు వెల్లడించారు. సోషల్ మీడియా మితిమీరిన వాడకం వల్ల పిల్లలు చదువుకు దూరమవ్వడమే కాకుండా, అనవసరమైన విషయాల పట్ల ఆకర్షితులవుతున్నారని సీఎం ఆందోళన వ్యక్తం చేశారుపిల్లల వ్యక్తిత్వ వికాసం, శారీరక దృఢత్వంపై ప్రభావం చూపుతున్న ఈ డిజిటల్ వ్యసనాన్ని అరికట్టేందుకు తల్లిదండ్రులు కూడా సహకరించాలని ఆయన కోరారు. త్వరలోనే దీనిపై విధివిధానాలను రూపొందించి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చంద్రబాబు పేర్కొన్నారు. ఇప్పటికే కర్ణాటక వంటి పొరుగు రాష్ట్రాలు కూడా ఇదే దిశగా అడుగులు వేస్తున్న తరుణంలో, ఏపీ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది. త్వరలోనే సోషల్ మీడియా నిషేధంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుని, ఉత్తర్వులు జారీ చేయనుంది. దీనిపై తాము కసరత్తు చేస్తున్నట్లు అసెంబ్లీ వేదికగా సభలో చంద్రబాబు వెల్లడించారు.పిల్లలు సరిగ్గా చదవడం లేదని, చెప్పిన మాట వినకుండా స్మార్ట్ ఫోన్లకు అతుక్కుపోతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని సందర్భాలలో ఫోన్ కొనివ్వకపోవడం, ఫోన్ లాగేసుకున్నారని పిల్లలు తీవ్ర నిర్ణయాలు తీసుకుని తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చుతున్నారు.

**ప్రణాళిక ప్రకారం కుట్ర చేశారు..**

ఏపీ శాసనసభలో శుక్రవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేసిన ప్రసంగం అటు గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే, ఇటు రాష్ట్ర భవిష్యత్తుపై దిశానిర్దేశం చేసేలా సాగింది. రాష్ట్రంలో ఫాక్షనిజం, మావోయిస్టుల ప్రాబల్యాన్ని తగ్గించి ప్రగతి సాధించామని గుర్తు చేస్తూనే, ప్రస్తుతం కొత్తగా పుట్టుకొచ్చిన రప్పా రప్పా రాజకీయ సంస్కృతిపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ పర్యటనల పేరుతో హింసను ప్రేరేపించడం, ఎస్సై స్థాయి అధికారులపై దాడులు జరగడం వంటి ఘటనలు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని ఆయన రాష్ట్రంలో వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో గంజాయి, డ్రగ్స్, బ్లేడ్ బ్యాచ్‌లను ప్రోత్సహించే నాయకులు తయారయ్యారని చంద్రబాబు మండిపడ్డారు. కటౌట్లకు పొట్టేళ్లను బలి ఇచ్చి రక్తాభిషేకం చేయడం వంటి హింసాత్మక పద్ధతులు నేరుగా నేరస్తులను ప్రోత్సహించడమేనన్నారు. పరామర్శల పేరుతో గంటల తరబడి ట్రాఫిక్‌ను స్తంభింపజేస్తూ, బలప్రదర్శన చేయడం ప్రజాస్వామ్యమా అని ప్రశ్నించారు.

పోస్టుమార్టానికి కారణమైన వారే.. ఇప్పుడు పోస్టుమార్టానికి వెళ్తామనడం విడ్డూరం అంటూ ప్రతిపక్ష నేతలపై పరోక్షంగా సెటైర్లు వేశారు. ప్రతిపక్షంలో ఉన్న పార్టీలు రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా అడ్డుకోవడం దేశంలో ఎక్కడా చూడలేదని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వస్తే పారిశ్రామిక ఒప్పందాలను రద్దు చేస్తామంటూ ఇన్వెస్టర్లను భయభ్రాంతులకు గురిచేయడం రాష్ట్ర ద్రోహమేనని ఆయన అభివర్ణించారు. అంతర్జాతీయంగా జరుగుతున్న యుద్ధాల వల్ల ఇప్పటికే మార్కెట్లు ప్రభావితమై ఎగుమతులు తగ్గాయని, ఇలాంటి క్లిష్ట సమయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సింది పోయి, అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదన్నారు.

శ్రీవేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదం విషయంలో జరిగిన అపవిత్రతపై చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. ఇది తెలియక జరిగిన పొరపాటు కాదు.. కుట్రపూరితంగా చేసిన నేరం అని ఆయన స్పష్టం చేశారు. ఎన్డీడీబీ నివేదిక కల్తీ నెయ్యిని ధ్రువీకరించినప్పటికీ, తప్పు చేసిన వారు కనీసం క్షమాపణలు చెప్పకుండా దౌర్జన్యం చేస్తున్నారని మండిపడ్డారు. తిరుమల పవిత్రతను దెబ్బతీసే ప్రయత్నం ఏడు కొండలను రెండు కొండలు చేసినప్పటి నుంచే మొదలైందని ఆయన ఆరోపించారు.రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఐక్యంగా ముందుకు సాగాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పదేపదే చెబుతున్నట్లుగా, రాబోయే 15 ఏళ్ల పాటు ఎన్డీఏ కూటమి అధికారంలో ఉంటేనే రాష్ట్రానికి సుస్థిరత లభిస్తుందని పేర్కొన్నారు.

మనకు ఒక అజెండా ఉంది.. 2029లో మళ్ళీ గెలవాలి, 2047 నాటికి అభివృద్ధి చెందిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను నిలబెట్టాలి అని తన లక్ష్యాన్ని వివరించారు.ప్రజలు ఇచ్చిన గొప్ప అవకాశాన్ని ప్రజాప్రతినిధులు సద్వినియోగం చేసుకోవాలని, అధికారులు నాయకులు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ఎవరి వ్యక్తిగత ప్రవర్తన వల్ల కూడా ప్రభుత్వానికి లేదా కూటమి పార్టీలకు ఇబ్బంది కలగకూడదని ఆయన గట్టిగా హెచ్చరించారు. ప్రజల మద్దతుతోనే మనం ఈ స్థానంలో ఉన్నామని ప్రతి నిమిషం గుర్తుంచుకుని పనిచేయాలని కోరారు.

# ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశంలో పాల్గొన్న ప్రభుత్వ విప్

**జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 0**



తుర్కపల్లి మండలం వేల్పుపల్లి గ్రామంలోని కూరెళ్ళ పద్మ అశోక్ గౌడ్ నాగాయపల్లి తండలోని ధరావత్ మౌనిక ప్రవీణ్ నాయక్ ల ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట ఇచ్చిన ప్రకారం లబ్ధిదారులకు పట్టు వస్త్రాలు, యాట పొట్టేలును అందజేసినట్లు తెలిపారు. పేద ప్రజల సొంతింటి కల నెరవేర్చాలని లక్ష్యంతో ప్రజాపాలన ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నాయకత్వంలో ఇందిరమ్మ ఇండ్లను అందిస్తున్నామని అన్నారు. ప్రతి పేద కుటుంబం గౌరవంగా జీవించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. గత పది సంవత్సరాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఏ ఒక్కరికి ఇల్లు ఇవ్వలేదని, ప్రజాపాలన కాంగ్రెస్ ప్రభుత్వం లో నియోజకవర్గంలో 3500 ఇళ్లను ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందని అన్నారు. రెండో విడత లో కూడా ఇండ్లను మంజూరు చేయనున్నట్టు తెలిపారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇచ్చే బాధ్యత తనదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలు ప్రతి ఒక్క కుటుంబానికి అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ అయిన చైతన్య మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ధనావత్ శంకర్ నాయక్, సర్పంచులు కోమటిరెడ్డి సంతోష భాస్కర్ రెడ్డి, రాజశేఖర్, గుండ సిద్దులు, భూక్య రాజారాం నాయక్ , కర్రె మాధవి కరుణాకర్ గౌడ్, గుగులోతు ధూప్ సింగ్ నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు పనిగట్ల సుదర్శన్ గౌడ్, హౌసింగ్ ఏఈ నరేష్, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మంచి నీటి సరఫరాలో ఇబ్బంది లేకుండా చూడాలి

- షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- పబ్లిక్ హెల్త్, రోడ్డు భవనాల శాఖ, భగీరథ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే శంకర్

**జయభేరి, షాద్ నగర్, మార్చి 06 :**



వేసవికాలంలో నీటి ఎద్దడి నివారణ చర్యలు తీసుకోవాలని అధికారులను షాద్ నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లోని తాగునీటి సరఫరా పరిస్థితిని ప్రతిరోజు నిశితంగా పర్యవేక్షించాలని సూచించారు. మండలాల వారీగా సమీక్ష సమావేశం నిర్వహించి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ...ఎక్కడైనా సరే పైప్ లైన్ లీకేజి జరిగితే తక్షణమే స్పందించి లైకేజీలను అరికట్టాలని అధికారులను ఆదేశించారు. మండలాల వారీగా సమ్మర్ యాక్షన్ ప్లాన్ తయారు చేసి నివేదిక అందించాలని అధికారులను కోరారు.

అమృత్ స్కీమ్ లో భాగంగా చేపడుతున్న ట్యాంక్ ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలని కోరారు. అదేవిధంగా మిగిలిన పైప్ లైన్ కనెక్షన్ తో పాటు ట్యాప్ కనెక్షన్లు కూడా త్వరగా ఇవ్వాలని కోరారు.షాద్ నగర్ పట్టణంలో పైప్ లైన్ తవ్వకాలు,కేబుల్ లైన్ తవ్వకాలు ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం, అనుమతులతో జరగాలని కోరారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్ లలిత, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కవిత,రోడ్డు, భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవీంద్ర,డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సందీప్,అబ్దుల్ బారి,అన్ని మండలాల మిషన్ భగీరథ గ్రిడ్,ఇంట్రా అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, మున్సిపల్ డిఇ నరేష్,పబ్లిక్ హెల్త్ డిఇ సాజిద్ ,ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.




# దేవరకొండ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రజాపాలన

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్ , వైస్ చైర్మన్ జువేరియా తపస్వం , కమిషనర్ పూర్ణచంద్రరావు , కౌన్సిలర్ శ్రీకన్యా సేవ్యా నాయక్ ఇతర కౌన్సిలర్లు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆశీస్సులు అందరికీ కలగాలి



**జయభేరి, మేడిపల్లి :**

మేడిపల్లి, పి & టి కాలనీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో మహా కుంభాభిషేకం, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, మహా పూర్ణాహుతి కార్యక్రమం ఎంతో భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడింది. ఈ పవిత్ర కార్యక్రమానికి అనేక మంది భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథులుగా మేడ్చల్ DCC అధ్యక్షులు తోటకూరి వజ్రేష్ యాదవ్, పీర్జాదిగూడ మాజీ మేయర్ అమర్ సింగ్ హాజరై స్వామివారిని దర్శించుకొని కార్యక్రమానికి మరింత శోభను చేకూర్చారు. అలాగే ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివ కుమార్ గౌడ్, మాజీ కార్పొరేటర్ ప్రసన్న శ్రీధర్ రెడ్డి, మాజీ పీర్జాదిగూడ అధ్యక్షులు తుంగతుర్తి రవి, మాజీ గ్రంథాలయ చైర్మన్ దర్గా దయాకర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ శాలిని శ్రీకాంత్ గౌడ్, మాజీ కార్పొరేటర్ నవీన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ సుభాష్ నాయక్, మాజీ కార్పొరేటర్ అనంత్ రెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యులు జగదీశ్వర్ రెడ్డి, హనుమాన్ ఆలయం డైరెక్టర్ ప్రశాంత్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పప్పుల అంజి రెడ్డి, బొడిగే కృష్ణ, యాసారం మహేష్, బండారి రవీందర్, బుచ్చి యాదవ్, రాజా రాజు భక్తులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని ఘన విజయంగా మార్చారు.



# 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల బహుకరణ

**జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 06 :**

తుర్కపల్లి మండలం గంధ మల్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు గ్రామ యువకుడు సింగబోయిన రమేష్ పరీక్ష ప్యాడులను బహుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 14 నుండి జరిగే 10 వ తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు కష్టపడి చదివి 100% ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ప్రధానోపాధ్యాయులు సుజాత మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పరీక్షా ప్యాడులను అందజేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యురాలు జింకల అలివేల ఎల్లేష్ యాదవ్, ఉపాధ్యాయులు వేణు, అశోక్, సునీత, శిరీష్, భానుమతి, శ్రీలత, విద్యార్థులు పాల్గొన్నారు.

# కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో హెల్త్ క్యాంపు




**జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 06 :**

తుర్కపల్లి మండలం రాంపూర్ తండాలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో శుక్రవారం రాష్ట్ర బాల సంస్థ కార్యక్రమం మొబైల్ హెల్త్ టీం ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గుగులోతు బద్దు నాయక్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన హెల్త్ మిషన్ 99 రోజుల కార్యక్రమంలో భాగంగా హెల్త్ క్యాంపు నిర్వహించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరీక్షల నిర్వహించి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డి ఐ ఓ డాక్టర్ రామకృష్ణ, పిఓ డాక్టర్ వంశీకృష్ణ, గైనకాలజిస్ట్ సుప్రియ, ఆప్తమాలిస్ట్ డాక్టర్ స్వప్న, డెంటల్ సర్జన్ డాక్టర్ గాంధీ, పీడియాట్రిషన్ డాక్టర్ వెంకటేశ్వర్లు, పీహెచ్సీ డాక్టర్ రుచిరా రెడ్డి, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ కవిత, పిఎమ్ఓ గాయత్రి, స్పెషల్ ఆఫీసర్ అనిత, ఏఎన్ఎం పులమ్మ, ఆశ వర్కర్ బుజ్జి, ఫార్మసిస్ట్ సంగీత పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాలల దోపిడీని అరికట్టాలి ఏఐఎస్ఎఫ్ డిమాండ్

- మండల విద్యాధికారికి వినతి పత్రం అందజేసిన ఏఐఎస్ఎఫ్ నాయకులు.
- ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట సమితి సభ్యుడు ఆకాష్ నాయక్



**జయభేరి, షాద్ నగర్, మార్చి 06 :**

రానున్న విద్యా సంవత్సరంలో ప్రైవేట్ పాఠశాలలు విద్యను వ్యాపారంగా మార్చకుండా, నిబంధనను అతిక్రమించే పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ ఫరూఖ్‌నగర్ మండల సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం మండల విద్యాధికారికి ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడు ఆకాష్ నాయక్ ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆకాష్‌నాయక్ మాట్లాడుతూ.. మండలంలోని పలు ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ, పాఠశాల ప్రాంగణాల్లోనే బుక్స్, యూనిఫార్మ్ విక్రయిస్తూ తల్లిదండ్రులను ఆర్థికంగా వేధిస్తున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వం వీటి అమ్మకాలను నిషేధించినా, ఫరూఖ్‌నగర్ మండలంలో తనిఖీలు లేకపోవడం వల్లే యాజమాన్యాలు రెచ్చిపోతున్నాయని ఆరోపించారు.

**ఏఐఎస్ఎఫ్ ప్రధాన డిమాండ్లు:**

పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫార్మ్ విక్రయాలను తక్షణమే నిలిపివేయాలి. అనుమతి లేకుండా అడ్డగోలుగా పెంచిన ఫీజులను నియంత్రించాలి. నిబంధనలు ఉల్లంఘించే పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలి. విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి తనిఖీలు చేపట్టాలి. ఫీజుల నియంత్రణపై అధికారులు కఠినంగా వ్యవహరించకపోతే, విద్యార్థులు మరియు తల్లిదండ్రులతో కలిసి భారీ ఎత్తున ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు అరుణ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టణంలో ఎండాకాలం నీటి సమస్య ఉండకూడదు

- సర్పంచ్ పసునూరి యుగేంధర్ రెడ్డి



**జయభేరి, కొండమల్లేపల్లి :**

కొండమల్లేపల్లి పట్టణం 8వ వార్డులో పాడైపోయిన బోరును ఎండాకాలం దృష్టిలో పెట్టుకొని నీటి సమస్య రాకుండా రిపేరు చేయించి తిరిగి నీటి సదుపాయం కల్పించారు సర్పంచ్ పసునూరి యుగేంధర్ రెడ్డి మాట్లాడుతూ.. పట్టణంలో ఎండాకాలం నీటి సమస్య రాకూడదు, ప్రతి వార్డులో జనాలకి నీటి సమస్య రాకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో వార్డు మెంబర్స్ గంట మల్లేష్, బిజిలి లింగం, వస్కుల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



## లగ్జరీ విల్లా కొన్న లేడీ సూపర్ స్టార్..

నయనతార చివరిసారిగా 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రంలో కనిపించింది. అనిల్ రావిపూడి తెరకెక్కించిన ఈ సినిమాలో మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటించారు. అలాగే విక్టరీ వెంకటేష్ మరో కీలక పాత్రలో కనిపించారు. దీన తర్వాత ఆమె టాక్సిక్ లో నటించింది. 'కెవిఎన్ ప్రొడక్షన్స్' నిర్మించిన ఈ పాన్ఇండియా చిత్రంలో యష్ హీరోగా నటించాడు. నయనతార మెయిల్ లీడ్ రోల్ లో నటించింది. మార్చి 19న విడుదల కావాల్సిన ఈ సినిమా అనూహ్యంగా వాయిదా పడింది. నయనతార చాలా సంవత్సరాలుగా సినిమా రంగంలో స్టార్ హీరోయిన్ గా కొనసాగుతోంది. ఓ వైపు స్టార్ హీరోల సినిమాల్లో నటిస్తూనే, మరోవైపు లేడీ ఓరియంటెడ్ మూవీస్ లోనూ యాక్ట్ చేస్తోంది లేడీ సూపర్ స్టార్. కొత్త నేటికీ ఆమె క్రేజ్, డిమాండ్ ఏ మాత్రం తగ్గలేదు. దక్షిణ భారతదేశంలోనే కాకుండా బాలీవుడ్‌లో కూడా ఆమె తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. షారుఖ్ ఖాన్ సరసన ఆమె నటించిన జవాన్ సినిమా ఏకంగా రూ. 1000 కోట్లకు పైగా కలెక్షన్లు రాబట్టిన సంగతి తెలిసిందే.





## హీరోయిన్లను వస్తువుల్లా చూపించొద్దు... సప్తమి గౌడ ఉద్యమానికి శివన్న మద్దతు

సినిమా ప్రచార కార్యక్రమాలు, ఆడియో లాంచ్‌లు, అవార్డు వేడుకలు వంటి పబ్లిక్ ఈవెంట్లలో హీరోయిన్ల ఫోటోలు, వీడియోలు తీయడం సాధారణమే. అయితే ఇటీవల కొంతమంది ఫోటోగ్రాఫర్లు, యూట్యూబ్ ఛానళ్ల ప్రతినిధులు హీరోయిన్లను అనుచిత కోణాల్లో చిత్రీకరించడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. అవసరం లేకపోయినా కెమెరాలను జూమ్ చేసి వారి శరీర భాగాలపై ప్రత్యేకంగా ఫోకస్ చేయడం, ఆ వీడియోలను సోషల్ మీడియాలో వైరల్ చేయడం వంటి ఘటనలు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితిపై కన్నడ నటి సప్తమి గౌడ తీవ్రంగా స్పందిస్తూ ఒక ఉద్యమాన్ని ప్రారంభించారు. కాంతారా చిత్రంతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన సప్తమి గౌడ ఇటీవల సోషల్ మీడియాలో ఈ సమస్యపై గట్టిగా స్పందించారు. మహిళా కళాకారులను వస్తువులుగా చూడకుండా వారి ప్రతిభను గౌరవించాలని ఆమె స్పష్టం చేశారు. ఉద్దేశపూర్వకంగా కెమెరాను జూమ్ చేసి అనుచిత కోణాల్లో చిత్రీకరించడం తమ గౌరవాన్ని దెబ్బతీసే చర్య అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. "మేము మా పనికోసం ఇక్కడ ఉన్నాం. ఉద్దేశపూర్వకంగా కెమెరాలను జూమ్ చేసి అనుచితంగా చిత్రీకరించడం మా గౌరవానికి భంగం కలిగిస్తుంది" అంటూ ఆమె పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో #ActorsNotObjects అనే హ్యాష్‌ట్యాగ్‌తో నటీమణులను వస్తువుల్లా కాకుండా కళాకారులుగా చూడాలని ఆమె పిలుపునిచ్చారు. సప్తమి గౌడ ప్రారంభించిన ఈ ఉద్యమానికి కన్నడ చిత్రసీమ నుంచి మంచి మద్దతు లభిస్తోంది. ప్రముఖ నటుడు శివ రాజ్‌కుమార్ ఆమెకు బహిరంగంగా మద్దతు ప్రకటించారు. సోషల్ మీడియా ద్వారా స్పందించిన ఆయన మహిళలను గౌరవించడం మన సంస్కారంలో భాగమని చెప్పారు. నటీమణులను కేవలం శరీరంగా చూసే ధోరణి వెంటనే ఆగిపోవాలని ఆయన హెచ్చరించారు. మహిళలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత. వారిని వస్తువుల్లా చూపించే ప్రయత్నాలను నిలిపివేయాలి" అంటూ #ActorsNotObjects హ్యాష్‌ట్యాగ్‌తో ఆయన తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇదే అంశంపై శివ రాజ్‌కుమార్ కుమార్తె, నిర్మాత నివేదిత రాజ్‌కుమార్ కూడా స్పందించారు. మహిళలను కేవలం శరీరంగా చూపించడం సమాజంలో పెరుగుతున్న దిగజారుడు ధోరణికి నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. ఇలాంటి ప్రవర్తనను సమాజం సహించకూడదని ఆమె స్పష్టం చేశారు. ఇక సప్తమి గౌడకు మద్దతుగా కన్నడ చిత్రసీమకు చెందిన పలువురు నటీమణులు ముందుకు వచ్చారు. రుక్మిణి వసంత్, ఆషికా రంగనాథ్ వంటి నటీమణులు కూడా సోషల్ మీడియాలో పోస్టులు చేస్తూ ఈ సమస్యపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. బహిరంగ కార్యక్రమాల్లో మహిళా నటుల ఫోటోలు, వీడియోలను అసభ్యకర కోణాల్లో చిత్రీకరించడం పూర్తిగా ఆమోదయోగ్యం కాదని వారు పేర్కొన్నారు.

## ఇంటర్వెల్ ట్విస్ట్‌తో యాక్షన్ మొదలు



అగ్ర నటుడు వెంకటేష్ హీరోగా త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో 'ఆదర్శకుటుంబం ఏకే 47' అనే పేరుతో సినిమా రూపొందుతున్న విషయం తెలిసిందే. శ్రీనిధి శెట్టి కథానాయికగా నటిస్తున్న ఈ సినిమాను హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ ఎలాంటి అంతరాయం లేకుండా సజావుగా సాగుతోంది. అక్టోబర్ 2న గాంధీ జయంతి కానుకగా సినిమాను విడుదల చేయాలనే ప్లాన్‌లో మేకర్స్ ఉన్నట్టు తెలుస్తోంది. ఈ సమ్మర్‌లోనే ప్రమోషన్స్ కూడా మొదలు పెట్టనున్నారట. ఇదిలావుంటే.. ఈ సినిమా కథకు సంబంధించిన ఆసక్తికరమైన విషయం వెలుగు చూసింది. రెండు భిన్నకోణాల్లో ఈ కథ సాగుతుందట. తొలి భాగమంతా కుటుంబ భావోద్వేగాలు, త్రివిక్రమ్ మార్క్ హ్యూమర్‌తో సాగుతుందట. అయితే.. ఇంటర్వెల్ బ్యాంగ్‌లో వచ్చే ట్విస్ట్ కథ దిశను పూర్తిగా మార్చి యాక్షన్ మోడ్‌లోకి తీసుకెళ్తుందట. అంటే.. అటు ఫ్యామిలీ ఆడియన్స్‌కీ, ఇటు మాస్ ప్రేక్షకులకూ నచ్చే కథ, కథనాలు ఉంటాయన్నమాట. హర్షవర్దన్ రామేశ్వర్ సంగీతం ఈ కథకు ప్రధాన బలం అవుతుందని ప్రత్యేకంగా చెబుతున్నారు.



## అందాల అచ్చియమ్మ..

అగ్ర హీరో రామ్‌చరణ్ 'పెద్ది' సినిమా వచ్చే నెల 30న విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రమోషన్లు వేగవంతం చేశారు. జాన్వీ కపూర్ ఇందులో కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. శుక్రవారం ఆమె పుట్టినరోజు సందర్భంగా 'పెద్ది'లోని ఆమె పాత్రను పరిచయం చేస్తూ స్పెషల్ పోస్టర్‌ని, బర్త్‌డే ట్రిబ్యూట్ వీడియోను మేకర్స్ విడుదల చేశారు. మెరూన్ కలర్ ఎంబ్రయిడరీ బ్లౌజ్, మ్యాచింగ్ లెహంగా ధరించి స్టైలిష్‌గా కనిపిస్తున్న జాన్వీకపూర్‌ని ఈ పోస్టర్‌లో చూడొచ్చు.

అచ్చియమ్మ అనే పల్లెటూరి అమ్మాయిగా ఇందులో జాన్వీ కనిపించనున్నది. ఇక వీడియోలో వింటేజ్ మైక్ ముందు పాట పాడుతూ జాన్వీకపూర్ కనిపించింది. శివరాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందుశర్మ, బోమన్ ఇరానీ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఆర్.రత్నవేల్, సంగీతం: ఏ.ఆర్. రెహమాన్, దర్శకత్వం: బుచ్చిబాబు సాన, నిర్మాత: వెంకటసతీష్ కిలారు, సమర్పణ: మైత్రీ మూవీమేకర్స్, సుకుమార్ రైటింగ్స్, నిర్మాణం: వృద్ధి సినిమాస్.

## ప్రేయసి నయనికతో అల్లు శిరీష్ వివాహం.. వధూవరులను ఆశీర్వదించిన సీఎం



మెగా కుటుంబంలో మరో శుభవార్త వినిపించింది. ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ చిన్న కుమారుడు, హీరో అల్లు శిరీష్ తన ప్రేయసి నయనికతో వివాహ బంధంలోకి అడుగుపెట్టాడు. ఈ పెళ్లి వేడుక శుక్రవారం (మార్చి 6, 2026) సాయంత్రం హైదరాబాద్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. నగరంలోని కొల్లూరు ప్రాంతంలోని ఐనా ఈవెంట్ స్పేస్‌లో జరిగిన ఈ వివాహానికి ఇరు కుటుంబాల సభ్యులు, బంధువులు, సన్నిహితులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన విషయం ఏమిటంటే, ఇదే రోజున అల్లు శిరీష్ అన్నయ్య, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ వివాహ వార్షికోత్సవం కూడా కావడం. దీంతో మెగా కుటుంబంలో ఒకేసారి రెండు ఆనందాలు చోటుచేసుకున్నాయి. పెళ్లి వేడుకకి సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖులతో పాటు రాజకీయ నాయకులు కూడా పాల్గొన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ వేడుకకు ప్రత్యేకంగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అలాగే మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కూడా పెళ్లికి హాజరై ఈ జంటకు శుభాకాంక్షలు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి వధూవరులకు పుష్పగుచ్ఛం అందించి ఆశీర్వాదాలు తెలిపారు. అనంతరం వధూవరులతో పాటు అల్లు అరవింద్, అల్లు అర్జున్‌లతో కలిసి ఫోటోలు దిగారు. ప్రస్తుతం ఆ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇక అల్లు శిరీష్, నయనికల ప్రేమ కథ కూడా ఆసక్తికరంగా ఉంది. గత నాలుగు నుంచి ఐదు సంవత్సరాలుగా వీరిద్దరూ ప్రేమలో ఉన్నట్లు సమాచారం. కుటుంబ కార్యక్రమాల్లో ఏర్పడిన పరిచయం క్రమంగా ప్రేమగా మారింది. ఆ తర్వాత పెద్దల అంగీకారంతో ఈ ప్రేమ కథ వివాహ బంధంగా మారింది. ఇదిలా ఉండగా, పెళ్లికి ముందు మూడు రోజుల క్రితం హైదరాబాద్‌లో ప్రీవెడ్డింగ్ రిసెప్షన్‌ను ఘనంగా నిర్వహించారు. ఆ వేడుకకు సినీ పరిశ్రమకు చెందిన అనేకమంది ప్రముఖులు హాజరయ్యారు. అయితే ప్రధాన పెళ్లి వేడుకను మాత్రం చాలా ప్రైవేట్‌గా, కేవలం కుటుంబ సభ్యులు మరియు అత్యంత సన్నిహితుల సమక్షంలో నిర్వహించడం విశేషం. ప్రస్తుతం అల్లు శిరీష్-నయనికల వివాహానికి సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. అభిమానులు, సినీ ప్రముఖులు ఈ జంటకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. మెగా అభిమానులు కూడా సోషల్ మీడియా వేదికగా ఈ జంటకు కొత్త జీవితానికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**